

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 29-12-2022 సంపుటి : 04 సంచిక : 113 పేజీలు : 4 వెల : రూ 3-00

## సానుకూలంగా స్పందించారు.. ప్రధానితో భేటీపై ఏపీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్



తాడేపల్లి: ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం కావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు."రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానమంత్రితో చర్చించా. రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదాతో పాటు, పలు పెండింగ్ అంశాలను పరిష్కరించాలని కోరాను. వీటిపై ప్రధాని గారు సానుకూలంగా స్పందించారు" అని సీఎం వైఎస్ జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.బుధవారం మధ్యాహ్న సమయంలో సుమారు గంట పాటు ప్రధాని మోదీతో ఏపీ సీఎం వైఎస్ జగన్ భేటీ అయ్యారు. విభజన చట్టంలో హామీలలో కీలకాంశాలు ఇంకా నెరవేరలేదని, త్వరగతిన వాటి విషయంలో నిర్ణయం తీసుకోవాలని ప్రధానిని కోరారు.రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానమంత్రి గారితో చర్చించడం జరిగింది. రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదాతో పాటు, పలు పెండింగ్ అంశాలను పరిష్కరించాలని కోరిన నేపథ్యంలో ప్రధాని గారు సానుకూలంగా స్పందించారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశం, కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిధుల విషయంతో పాటు పెండింగ్ బకాయిల విడుదలలో జాప్యం, జాతీయ ఆహార భద్రతా చట్టంలో నిబంధనలు, తెలంగాణ డిస్కం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలు, ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలతో పాటు మెట్రో రైల్వే లైన్, కడప స్టీల్ ప్లాంట్ అంశాలను సైతం ఆయన ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. వీటికి ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

## ప్రధానితో భేటీలో కీలకాంశాలను ప్రస్తావించిన సీఎం జగన్

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో భాగంగా.. దేశ ప్రధాని నరేంద్ర మోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం భేటీ అయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకాంశాలపై ప్రధాని మోదీతో చర్చించారు సీఎం జగన్. ముందుగా.. కోవిడ్ తాజా పరిణామాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రధానికి వివరించారు. ఆపై రాష్ట్ర విభజన జరిగి 8 ఏళ్ల సుదీర్ఘకాలం గడిచినప్పటికీ.. విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో చాలావరకు ఇప్పటికీ నెరవేర్చలేదని, పైగా రెండు రాష్ట్రాల మధ్య ఇంకా చాలా అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయని సీఎం జగన్, ప్రధానికి వివరించారు.గతంలో చేసిన విజ్ఞప్తి మేరకు విభజన చట్టంలో అపరిష్కృతంగా ఉన్న అంశాలు, పార్లమెంటు వేదికగా రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, రాష్ట్రానికి సంబంధించిన ఇతర హామీలపై కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ పలుమార్లు సమావేశం అయ్యిందని, అయినప్పటికీ కొంత పురోగతే కనిపిస్తోందని, కీలకాంశాలు మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదని ప్రధానికి వివరించారు సీఎం జగన్.? 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద చెల్లించాల్సిన బకాయిలు అలానే ఉన్నాయని, 2014-15 సంవత్సరానికి సంబంధించిన రూ.18,330.45కోట్ల బిల్లులు, 10వ వేతన సంఘం బకాయిలు, పెన్షన్లు మొదలైన వాటి రూపేణా మొత్తంగా రూ. 32,625.25 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరారు. గత ప్రభుత్వం పరిమితికి మించి అధికంగా చేసిన రుణాలను, ఈ ప్రభుత్వంలో సర్దుబాటు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ, రుణాలపై పరిమితి విధిస్తోంది. కేటాయించిన రుణ పరిమితిలో కూడా కోతలు విధిస్తోంది. ఈ ప్రభుత్వం ఎలాంటి తప్పులు చేయనప్పటికీ గత ప్రభుత్వం చేసిన దానికి ఆంక్షలు విధిస్తోంది. కోవిడ్‌లాంటి



విపత్కర పరిస్థితుల్లో ఈ ఆంక్షలు రాష్ట్రాన్ని బాగా దెబ్బతీస్తాయి. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని సీఎం జగన్, ప్రధానిని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులనుంచి ఖర్చు చేసిన రూ.2,937.92 కోట్ల రూపాయలను రెండేళ్లుగా చెల్లించలేదు. ఈ డబ్బును వెంటనే చెల్లించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం ఖరారు అంశం కూడా ఇంకా పెండింగులోనే ఉంది. మొత్తం ప్రాజెక్టుకోసం రూ.55,548 కోట్ల రూపాయలు అవుతుందని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఇప్పటికే ఆమోదించిన విషయాన్ని ప్రధానమంత్రికి గుర్తుచేశారు సీఎం జగన్. డ్రింకింగ్ వాటర్ సప్లైని ప్రాజెక్టు నుంచి వేరుచేసి చూస్తున్నారని, దీన్ని ప్రాజెక్టులో భాగంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో జాతీయ హోదా పొందిన ఏ ప్రాజెక్టులోనైనా డ్రింకింగ్ వాటర్‌ను ప్రాజెక్టులో భాగంగా చూశారని ప్రస్తావించారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని కాంపొనెంట్ వైజ్‌గా చూస్తున్నారని, బిల్లుల రీయింబర్స్‌మెంట్‌లో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడమే కాకుండా, వ్యయం కూడా పెరుగుతోందని ప్రధానికి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యవయాన్ని కాంపొనెంట్ వైజ్‌గా చూడొద్దని, ఆ నిబంధనలను పూర్తిగా తొలగించాలని సీఎం వైఎస్ జగన్ కోరారు. పోలవరంప్రాజెక్టు నిర్వాసితులకు సహాయ పునరావాస ప్యాకేజీని డీబీటీ ద్వారా చెల్లించాలని, దీనివల్ల చాలావరకు సమయం ఆదా అవుతుందని తెలిపారు. వీలైనంత త్వరగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని, ఆలస్యం అవుతున్నకొద్దీ ప్రాజెక్టు ఖర్చు పెరిగిపోతుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టునుంచి తక్షణమే ప్రయోజనాలను అందించడానికి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని సీఎం వైఎస్ జగన్, ప్రధాని మోదీకి వివరించారు.ఇందులో భాగంగా 41.15 మీటర్ల ఎత్తు వరకూ ఆయా కుటుంబాలను తరలించాల్సి ఉంటుందని, ఈమేరకు పనులు చేయడానికి దాదాపు రూ.10,485.38 కోట్లు అవసరం అవుతుందని, ఈ డబ్బును అడహాక్‌గా మంజూరు చేసినట్టైతే పనులు వేగంగా ముందుకు సాగుతాయని పీఎంకు వివరించారు. ఈ డబ్బు మంజూరు చేసినట్టైతే భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులు సకాలంలో పూర్తిచేయడానికి అవకాశం ఉంటుందని సీఎం జగన్, ప్రధానికి తెలిపారు.

## జీవీఎల్ తెగిన గాలిపటం.. మంత్రి అమర్నాథ్ చురకలు



తాడేపల్లి: బీజేపీ నేత, రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు, ఏపీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చురకలటించారు. విభజన హామీలపై అసలు జీవీఎల్‌కు అవగాహన ఉందా?అని నిలదీశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.."విభజన హామీలపై జీవీఎల్ చర్చకు రావాలి. స్టీల్ ప్లాంట్‌కి బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తుందో ఆయన సమాధానం చెప్పాలి" అని నిలదీశారు. జీవీఎల్ తెగిన గాలిపటం లాంటి వ్యక్తి. ఏ పార్టీలో ఉంటారో కూడా తెలియని వ్యక్తి జీవీఎల్ అని గుడివాడ అమర్నాథ్ ఎద్దేవా చేశారు.

## నాలుగేళ్లలో ప్రజలకు ఏం చేశామని ఓట్లు అడుగుతాం: వైకాపా ఎమ్మెల్యే ఆనం



నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వంపై వైకాపా ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నెల్లూరు జిల్లా రాపూరులో నూతనంగా నియమించిన సచివాలయ వైకాపా కన్వీనర్లు, వాలంటీర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ప్రసంగించారు."రోడ్ల గుంతలు పూడ్చలేకపోతున్నాం.. తాగడానికి నీళ్లు లేవు. నాలుగేళ్లలో ఏం పని చేశామని ప్రజలను ఓట్లు అడుగుతాం. ప్రాజెక్టులు కట్టామా? పనులు మొదలుపెట్టామా? పింఛన్లు ఇస్తే ఓట్లు వేస్తారా? అలా అయితే గత ప్రభుత్వమూ ఇచ్చింది. ఇల్లు కడతామని లేఅవుట్ వేసినా ఇప్పటికీ కట్టలేదు" అని రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ఆనం విరుచుకుపడ్డారు."ఎస్ఎస్ కెనాల్ కడతామని ఎన్నికల వేల హామీ ఇచ్చాం. మూడున్నరేళ్లయినా కనీసం కెనాల్ గురించి పట్టించుకోలేదు. ఎస్ఎస్ కెనాల్ గురించి సీఎం జగన్‌కు ఎన్నోసార్లు చెప్పాం. ఇదే విషయాన్ని అసెంబ్లీలోనూ ప్రస్తావించాం. ఎస్ఎస్ కెనాల్ గురించి చీఫ్ ఇంజినీర్ల భేటీలోనూ కోరాం. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉంది. కంటి ముందు నీళ్లున్నాయని సంతోషపడటమే తప్ప నీళ్లు తాగలేని పరిస్థితి. ఇక్కడి నీళ్లు తాగగలమనే ఆత్మవిశ్వాసం ప్రజలకు లేదు. కండలేరు దగ్గరే ఉన్నా రాపూరులో ఒక్క చెరువులో నీళ్లు నింపలేకపోయాం. కండలేరు అభివృద్ధి విషయంలో వైఎస్ఆర్ కలను నెరవేర్చలేకపోయాం. వైఎస్ఆర్ కలను నెరవేర్చలేని దౌర్భాగ్య స్థితిలో మనం ఉన్నాం. ప్రజలు ప్రస్తుతం నన్ను కూడా నమ్మే పరిస్థితిలో లేరు. అపనమ్మక వ్యవస్థలో పనిచేస్తున్నాం. గ్రామాల్లో ప్రజలకు బిందెడు నీళ్లు ఇవ్వలేకపోతున్నాం" అని ఆనం మండిపడ్డారు.

## 'యువగళం' పేరిట నారా లోకేశ్ పాదయాత్ర

అమరావతి: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాదయాత్రకు 'యువగళం' పేరును నిర్ణయించారు.ఈ మేరకు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అధికారికంగా ప్రకటించారు. వచ్చే నెల 27 నుంచి లోకేశ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. మొత్తం 400 రోజుల్లో 4వేల కిలోమీటర్లు ఆయన నడవనున్నారు. పాదయాత్ర మార్గంలో వివిధ వర్గాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.చిత్తూరు జిల్లా కుప్పం నుంచి లోకేశ్ పాదయాత్ర ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను తెదేపా త్వరలో ప్రకటించనుంది. హంగు, ఆర్భాటం లేకుండా సాదాసీదాగా ఉండేలా పాదయాత్ర ఏర్పాట్లు చేయాలని పార్టీ నేతలకు లోకేశ్ సూచించారు.మరోవైపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో వైకాపా సర్కారు విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, నిరుద్యోగ యువత తమ సమస్యలు తెలిపేందుకు 'యువగళం' పాదయాత్ర వేదికగా నిలుస్తుందని చెప్పారు.



## చంద్రబాబుకు పవన్ ఊడిగం చేస్తున్నాడు: మంత్రి అంబటి ఫైర్

పల్నాడు: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ఊడిగం చేస్తున్నాడు అంటూ మంత్రి అంబటి ఫైర్ అయ్యారు.కాగా, మంత్రి అంబటి బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 'పవన్ కల్యాణ్, చంద్రబాబు కలిసి కాపులను మోసం చేస్తున్నారు. పవన్ బుద్ధి, జ్ఞానం లేని రాజకీయాలు చేస్తున్నాడు. ఒక్కచోట కూడా గెలవలేని పవన్ నాపై ఆరోపణలు చేస్తాడా?. చంద్రబాబుకు పవన్ ఊడిగం చేస్తున్నాడు. పవన్ కల్యాణ్ ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకుంటాడు' అని ప్రశ్నించారు.



## శాంతించని మంచుతుపాను..

### గడ్డకట్టిన నయాగరా జలపాతం



అమెరికాలో మంచు తుపాను తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. బఫెలో ప్రాంతం మంచులో కూరుకుపోయింది. ఫలితంగా మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అంచనావేస్తున్నారు.మిలిటరీ పోలీసులు చాలా చోట్ల డ్రైవింగ్ బ్యాన్‌ను విధించారు. పశ్చిమ న్యూయార్క్‌లో మరో అంగుళం మందాన మంచు కురిసినట్లు నేషనల్ వెదర్ సర్వీస్ పేర్కొంది. బఫెలో ప్రాంతంలో క్రిస్మస్ ముందు మొదలైన హిమపాతం.. ఆ తర్వాత తీవ్ర రూపం దాల్చింది. ఫలితంగా ఇక్కడ 50 అంగుళాల కంటే అధికంగా మంచుపడింది. చాలా చోట్ల కార్లలో, ఇళ్లలో, మంచు దిబ్బల్లో ప్రజలు చనిపోతున్నారు. ఆండెల్ టేలర్ అనే 22 ఏళ్ల యువతి బఫెలోలో ఒక కారులో చిక్కుకుపోయింది. దాదాపు 18 గంటల పాటు ఆమె చలిలోనే ఉండటంతో ప్రాణా లు కోల్పోయింది. ఆమె చనిపోవడానికి ముందు ఫేస్‌బుక్‌లో ఒక వీడియో పోస్టు చేసింది. దీనిలో ఆమె కారు పూర్తిగా మంచులో కూరుకుపోయినట్లు కనిపిస్తోంది. బఫెలో ప్రాంతంలో 1977లో వచ్చిన మంచు తుపాను కంటే ఇది మరింత తీవ్రమైందిగా భావిస్తున్నారు. అప్పట్లో మంచుతుపానుకు 29 మంది చనిపోగా.. ఇప్పుడు మృతుల సంఖ్య అంతకంటే ఎక్కువగా ఉండొచ్చని అంచనా.అమెరికాలో ఇటీవల ఉష్ణోగ్రతలు 0 డిగ్రీల కంటే



దిగువకు పడిపోవడంతో నయాగరా జలపాతం గడ్డకట్టింది. దీంతో పర్యాటకులు ఈ అద్భుత దృశ్యాన్ని చూసి ముగ్ధులైపోయారు. నయాగరాకు 25 మైళ్ల దూరంలోని బఫెలో ఉంటుంది. నయాగరాలో కొన్ని ప్రదేశాల్లో నీరు గడ్డకట్టినా.. ప్రవాహం కారణంగా మరికొన్ని చోట్ల మాత్రం జలపాతం పరవళ్లు తొక్కుతూనే ఉంది. ఈ జలపాతం నుంచి ప్రతి సెకన్‌కు 3,160 టన్నుల నీరు కిందకు పడుతుంటుంది. ఈ నీరు సెకనుకు 32 అడుగుల వేగంతో ప్రయాణిస్తుంది.

# సంపాదకీయం

గురువారం 29 -12-2022

## ముందస్తు భయం....

ఏదైతే.. మళ్లీ వినకూడదనుకున్నామో... ఏదైతే మళ్లీ చూడకూడదని అనుకున్నామో.... మళ్లీ అదే జరుగుతోంది. కొన్ని రోజులుగా కరోనా మహమ్మారి కాస్త కూల్‌గా ఉందనుకున్న సమయంలో.. వరల్డ్ వైడ్‌గా మళ్లీ హైటెన్షన్ క్రియేట్ చేస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. ఏకంగా నాల్గోసారి కూడా ప్రపంచాన్ని గడగడలాడించేందుకు సిద్ధమవుతుంది కరోనా కొత్త వేరియంట్.ఆ మహమ్మారి, ఇప్పుడు మరోసారి దాడి చేసేందుకు సిద్ధమవుతోందా.? అంటే అవుననే సంకేతాలు వినిపిస్తున్నాయి. ప్రపంచం వణికిపోతున్న తీరు... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలర్టులు... ఇవన్నీ చూస్తుంటే నిజమే అనిపిస్తోంది. మళ్లీ మాస్కయితే మస్ట్ అనిపిస్తోంది. మరీ ముఖ్యంగా కరోనాకు పుట్టినిల్లు అయిన చైనాలో ఓ రేంజ్‌లో వణికిస్తోందీ మహమ్మారి. ఒమిక్రాన్ ఃఈ–7 వేరియంట్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. అంతకంతకూ కేసులు, మరణాలు పెరిగిపోతున్నాయి. ఈ వారంలో ఒక్కరోజే రికార్డ్ స్థాయిలో 3కోట్ల 70లక్షల మందికి కరోనా సోకినట్టు తెలుస్తోంది.చైనాలో ఇప్పటి వరకు ఒకే రోజున నమోదైన అత్యధిక కేసుల సంఖ్య 40 లక్షలు. ఇప్పుడు ఏకంగా ఒకే రోజు దాదాపు 4 కోట్ల కేసులు నమోదవడం కలకలం రేపుతోంది. ప్రపంచంలో ఇంతవరకు ఏ దేశంలో కూడా ఒకే రోజున ఈ స్థాయిలో కేసులు నమోదు కాలేదు. చైనాలో విజృంభిస్తున్న కేసుల నేపథ్యంలో ప్రపంచదేశాలు అలెర్ట్ అవుతున్నాయి. ఇటు భారత ప్రభుత్వం సైతం రాష్ట్ర ప్రభుత్వాలను అలెర్ట్ చేశాయి. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా...ఓ వార్త ఇప్పుడు సోషల్‌మీడియాలో తెగ వైరల్ అవుతుంది. కరోనాకు భయపడి, ప్రజలు ఆక్సిజన్ సిలిండర్లు, మెడిసిన్‌ను కొనేందుకు సిద్ధపడుతున్నారటా.? ఇంతకీ ఈ వార్తలో నిజమెంత..? కరోనా వైరస్ కన్న ఇప్పుడు వ్యాపిస్తున్న వేరియంట్ నిజంగానే డేంజరా..? కరోనా మహ్మమారికి బయపడి, ఎక్కడ తమను ఎటాక్ చేస్తుందోనన్న భయంతో ప్రాణాలు వదులుకున్నవాళ్లు చాలానే ఉన్నారు. ఇక కరోనా సోకిన వారికి తగిన స్థాయిలో చికిత్స అందకుండా.. ఆస్పత్రిలో ఆక్సిజన్ సిలిండర్లు లేక చనిపోయిన వాళ్లు మరికొంత మంది ఉన్నారు. ఈ క్రమంలో కొంతమంది ప్రజలు.. ఈసారి రాబోయే వేరియంట్ కరోనా కన్నా భయంకరమని భావించి, ముందస్తుగానే ఆక్సిజన్ సిలిండర్లు, మెడిసిన్ కొంటున్నారన్న వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ఇలా చేయడం కరెక్ట్ కాదని అంటున్నారు నిపుణులు. సిలిండర్లను ఎప్పుడు ఎలా వాడాలన్న అవగాహన లేకపోతే.. తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కరోనా సోకిన వ్యక్తి యొక్క పల్స్ రేట్ ఏవిధంగా ఉంది.. మందులతో నయం అవుతుందా..? లేదా..? ఆక్సిజన్ అవసరమా..? ఒకవేళ ఆక్సిజన్ అవసరం ఉంటే.. ఎంతసేపు ఆ వ్యక్తికి ఆక్సిజన్ అవసరం అన్న విషయాలపై కేవలం డాక్టర్లకు మాత్రమే అవగాహన ఉంటుంది. కాబట్టి ముందుగానే ఆక్సిజన్ సిలిండర్లను కొని ఇంట్లో పెట్టుకోవడం వల్ల ఎలాంటి లాభం లేదని అంటున్నారు వైద్యనిపుణులు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతోపాటు చాలా రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధంగా ఉన్నాయి. ఒమిక్రాన్ వేవ్ సమయంలోనే వాటి అవసరం రాలేదు. మరీ ముఖ్యంగా భారతీయుల శరీరాల్లో యాంటీబాడీస్ ఉన్నాయి. అయితే ఇంతకు ముందు వచ్చిన కరోనా కంటే.. ఈ బీ17 వేరియంట్ డేంజరన్న విషయాన్ని ఇప్పుడే చెప్పలేమని అంటున్నారు వైద్యనిపుణులు. అందరి మెదడులో ఇప్పుడు ఇదే ప్రశ్న ఉంది. ప్రస్తుతం చైనాలో బీఏ2.75, బీక్యూ1, ఎక్స్ బీబీ, బీఎఫ్ 7 వ్యాపిస్తున్నాయి. ఇవన్నీ ఒమిక్రాన్ వేరియంట్లేగా ఇప్పటికే నిర్ధారించారు డాక్టర్లు. అయితే ఈ బీఎఫ్–7 ఒమిక్రాన్ సబ్ వేరియంట్ అత్యంత ప్రమాదకరంగా భావిస్తున్నారు. దీనిపై నిపుణుల అధ్యయనం కొనసాగుతోంది. అయితే అత్యంత వేగంగా విజృంభించడం దీని ప్రథమ లక్షణంగా భావిస్తున్నారు. ఈ వేరియంట్ ఇన్‌క్యుబేషన్ పీరియడ్ కూడా చాలా తక్కువని గుర్తించారు. ఈ వేరియంట్ ఏ వ్యాక్సిన్‌ని అయినా తట్టుకొని నిలబడగల శక్తి ఉంది. ఈ కొత్త వేరియంట్ లక్షణాలపై ఇపుడిపుడే కొంత స్పష్టత వస్తోంది. ఈ వేరియట్ వేగంగా వ్యాప్తి చెందుతుందని అంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. ఒకరికి ఈ వేరియంట్ సోకితే.. వారి నుంచి 10 నుంచి 18 మంది వరకూ విస్తరిస్తుందని అంటోంది చిఊూ. ఈ వేరియంట్ సోకిన వారిలో జ్వరం, దగ్గు, గొంతు గరగర, జలుబు, నీరసం, విపరీతంగా ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయనీ అంటున్నారు వైద్య నిపుణులు. అతి కొద్ది కేసుల్లో మాత్రమే వాంతులు, డయేరియా వంటి పొట్ట సంబంధ వ్యాధులు బయటపడవచ్చని చెబుతున్నారు వైద్యులు.

## జగన్ వ్యాఖ్యలపై అధికారుల్లో చర్చ

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్) ప్రెస్‌మీట్లు పెట్టి సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారాలు చేసే ప్రతిపక్ష నేతలు, మీడియాను బాగా తిట్టండి అని సీఎం జగన్మోహన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లకు సూచించడం రాజకీయంగా చర్చనీయాంశమయింది. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. పార్టీ నేతలతో ఇంత కాలం దారుమమైన తిట్లు తిట్టించిన జగన్ ఇప్పుడు అధికారులతో కూడా అదే పని చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని.. మండి పడుతున్నారు. ప్రభుత్వం, వైఎస్ఆర్‌సీపీ పాలనపై ప్రజలు నమ్మకం కోల్పోయారని ఇక అధికారులపై ఆధారపడుతున్నారని అంటున్నారు. అయితే ఇప్పుడు సీఎం జగన్ ఇచ్చిన సూచనలు లేదా ఆదేశాలను అధికారులు ఎలా తీసుకుంటారన్నది సస్పెన్స్ గా మారింది. ప్రతిపక్షాలు. మీడియాపై వారు వైఎస్ఆర్‌సీపీ నేతల్లాగే ప్రెస్ మీట్లు పెడతారా ? దూకుడు పెంచుతారా ? నిన్నటివరకు పార్టీ శ్రేణులు, వాలంటీర్లకే ప్రతిపక్షాలపై ఎదురుతిరగండి..నిలదీయండి అని చెప్పిన ఏపీ సిఎం జగన్ ఇప్పుడు అధికారులకు కూడా ఇదే ఆదేశాలు ఇవ్వడం రాజకీయంగా చర్చకు తావిస్తోంది. ఇప్పటికే యూనివర్సిటీలు, ప్రభుత్వశాఖలను పార్టీ కేడర్ గా వైసీపీ మార్చేసిందన్న విపక్షాల విమర్శలకు ఇప్పుడు జగన్ ఆదేశాలు మరింత ఊతమిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని తగ్గించాలంటే ఇంత కంటే మార్గం లేదని జగన్ భావిస్తున్నట్లుగా వైఎస్ఆర్‌సీపీ వర్గాలు చెబుతున్నాయి. ఏపీ సిఎంగా జగన్ పదవి చేపట్టినప్పటి నుంచి విపక్షాల విమర్శలకు అడ్డులేకుండా పోతోందన్నది అధికారపార్టీ ఆవేదన. దీనికి తోడు మీడియా కూడా అబద్ధపు వార్తలను ప్రచారం చేస్తోందని చాలా సార్లు వైసీపీ నేతలే కాదు స్వయానా ముఖ్యమంత్రి కూడా ప్రజా సభల్లో అసహనం వ్యక్తం చేశారు. పదేపదే విషప్రచారాలు చేస్తోందని జగన్ ఆరోపించడమే కాదు ఇక పార్టీ శ్రేణులను కూడా ఎక్కడిక్కడ ఈ కుట్రలకు తెరదించాలని సూచించారు. అలాగే వాలంటీర్లని కూడా ప్రతిపక్షాలను అవసరమైతే నిలదీయమని సలహా ఇచ్చారు. దీంతో గత కొంతకాలంగా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి విపక్షాలతో వైసీపీ శ్రేణులు ఢీ అంటే ఢీ అన్న లెవల్లో పోరుబాట పట్టారు. ప్రెస్ మీట్ ద్వారా ఎప్పటికప్పుడు విపక్షాలు చేస్తున్న ఆరోపణలు.. మీడియాలో జరుగుతున్న ప్రచారాలకు కౌంటర్ ఇస్తున్నారు. అయితే ఇది చాలా వరకూ గీత దాటే ఉంటుంది. ఎక్కువగా ఘాటు పదజాలంతో విరుచుకుపడుతూ ఉంటారు. సిఎం జగన్ గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం వెనక ఉన్న అసలు కారణం ప్రజల్లో ప్రభుత్వం పట్ల విపక్షాలు పన్నుతున్న కుట్రలను తెలియజెప్పడమే అన్నది బహిరంగ రహస్యమేనని వైఎస్ఆర్‌సీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇంత చేస్తున్నా ఇంకా జగన్ పాలనపై విపక్షాలు ఆరోపణలు చేయడమే కాకుండా వ్యతిరేక వార్తలను ప్రచారం చేస్తోందని భావించిన జగన్ దీనికి చెక్ పెట్టేందుకు అధికారులకు కూడా ఫ్రీ హ్యాండ్ ఇచ్చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఆరోపణలు చేసే విపక్షాలకు కలెక్టర్లు సరైన రీతిలో సమాధానం ఇవ్వమని ఆదేశించారు.తప్పు చేయనప్పుడు ఎందుకు విమర్శలు ఎదుర్కోవాలి అని చెబుతూ వ్యతిరేక ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకు రంగంలోకి దిగాల్సిన సమయం వచ్చిందని చెబుతూ విపక్షాలను నిలదీయమని ఆదేశించారు. ఇప్పటికే జగన్ తీరుపై విపక్షాలతో రాక్షస పాలనంటూ ప్రచారం చేస్తోంది. అంతేకాదు ఇప్పుడు విజయవాడ వేదికగా అఖిలపక్షం కూడా భేటీ అయి జగన్ పై పోరుకి సిద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో సిఎం జగన్ ఈ అధికార–విపక్షాల పోరులో జిల్లా కలెక్టర్లని రంగంలోకి దింపడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయచదరంగంలో జిల్లా అధికారులే చివరకు బలిపశువులయ్యేదని కొందరు వాదిస్తుంటే మరికొందరు మాత్రం తప్పుడు వార్తలు ప్రచారం చేసినప్పుడు నిలదీయాల్సిన అవసరం ఉందని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే అధికారులపై ఒత్తిడి పెరిగిందన్న వార్తల నేపథ్యంలో సిఎం జగన్ ఆదేశాలను కలెక్టర్లు ఎలా రిసీవ్ చేసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం సివిల్ సర్వీస్ అధికారుల్లో చాలా మంది ప్రభుత్వం చెప్పినట్లుగా చేసేవారున్నారు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులైన వారే కీలకమైన స్థానాల్లో ఉన్నారు. అలాగే కలెక్టర్లు, ఎస్పీలు కూడా అత్యంత నమ్మకస్తులే ఉన్నారు. ఇప్పుడు జగన్ నేరుగా తిట్టమని ఆదేశించినందున ఇలాంటి వారు ఇక ముందు మీడియా సమావేశాలు పెట్టి ప్రతిపక్ష నేతల్ని టార్గెట్ చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఏపీలో సరికొత్త రాజకీయ వాతావరణం ఏర్పడనుందని భావిస్తున్నారు.

## వివాదాల జయరామ్...

కర్నూలు, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)ఉమ్మడి కర్నూలు జిల్లా ఆలూరులో నిర్వహించిన సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో మంత్రి గుమ్మనూరు జయరామ్ కుటుంబ సభ్యుల తీరుపై నొచ్చుకుని వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు విరూపాక్షి రాజీనామాకు సిద్ధపడ్డారు. చిప్పగిరి సభలో మంత్రి కుమారుడు ఈశ్వర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనికితోడు మంత్రి బంధువు? పార్టీ మండల కన్వీనర్ నారాయణ సైతం జడ్పీటీసీవైపు వేలు చూపిస్తూ చేసిన హెచ్చరికలు సమస్యను మరింత పెద్దవి చేశాయి. రెండు కార్లలో వెళ్తే, బ్యానర్లు కట్టుకుంటే లీడర్లు కాలేరని.. బ్రాండ్ అంటే గుమ్మనూరు అని మంత్రి కుమారుడు ఈశ్వర్ వ్యాఖ్యలు చేశారు. జడ్పీటీసీ పదవికి రాజీనామా చేస్తే.. ఇద్దరం పోటీ చేసి ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని నారాయణ సవాల్ విసిరారు. మంత్రి భిక్షతోనే జడ్పీటీసీ అయిన విషయం మర్చిపోవద్దని విరూపాక్షిని దెప్పి పొడిచారు. ఈ వ్యాఖ్యలు, సవాళ్లతో ఒక్కసారిగా వైసీపీ రాజకీయం మారిపోయింది.మంత్రి కుమారుడు, బంధువుల వ్యాఖ్యలతో మనస్తాపం చెందిన విరూపాక్షి జడ్పీటీసీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధ పడ్డారు. ఒకటిరెండు రోజుల్లో రాజీనామా చేస్తానని లోకల్ పార్టీ గ్రూపుల్లో విరూపాక్షి పోస్టులు పెట్టారు. వైఎస్ కుటుంబంపై అభిమానంతో వైసీపీలో పనిచేస్తున్నారని.. అందుకు గుర్తింపుగా జడ్పీటీసీ టికెట్ ఇచ్చారని.. ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని చెబుతున్నారు విరూపాక్షి. జడ్పీటీసీ పదవికి రాజీనామా చేసినా వైసీపీలోనే కొనసాగుతానని ఆయన ప్రకటించారు.వాస్తవానికి మంత్రి జయరామ్‌కు, జడ్పీటీసీకి కొంతకాలంగా విభేధాలు ఉన్నాయి. జడ్పీటీసీ పనులు ఏవీ చేయొద్దని అధికారులను మంత్రి అనుచరులు ఆదేశించారట. జడ్పీటీసీ, మంత్రి ఒకే సామాజికవర్గం కావడం, భవిష్యత్తులో తన సీటుకు పోటీ వస్తారని భావించి విరూపాక్షిని వ్యూహాత్మకంగా దూరం పెడుతున్నారట. పోటాపోటీగా కార్యక్రమలు చేపట్టడంతో వారి మధ్య గ్యాప్ వచ్చింది. నిజానికి మంత్రి అయినప్పటి నుంచి జయరామ్‌ను అనేక వివాదాలు ముసురుకున్నాయి. మొదట్లో ఇూఎ స్కామ్‌లో ఆరోపణలు వచ్చాయి. తర్వాత నియోజకవర్గంలో పేకాట వ్యవహారాలతో రచ్చ రచ్చ అయ్యింది. ఇటీవల భూ ఆక్రమణల ఆరోపణలు మరో లెవల్‌కు తీసుకెళ్లాయి. వివాదాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మొన్నటి కేబినెట్ విస్తరణలో జయరామ్‌కు సీటు ఉంటుందో ఊడుతుందో అని చర్చ సాగింది.

కానీ.. సామాజిక సమీకరణాల లెక్కల్లో జయరామ్ తన మంత్రి పదవిని పదిలం చేసుకున్నారు. కేబినెట్‌లో కొనసాగించడంతో తనకేం కాదన్న ధీమానో ఏమో.. మంత్రితోపాటు మంత్రి అనుచరులు, కుటుంబ సభ్యులు గీత దాటుతున్నారని పార్టీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ క్రమంలోనే జడ్పీటీసీ విరూపాక్షి ఎపిసోడ్ చర్చకు వచ్చింది.జడ్పీటీసీ విరూపాక్షి రాజీనామాను అధికారులు ఆమోదిస్తే.. ఉపఎన్నిక వస్తే చిక్కుల్లో పడేది మంత్రి జయరామే అనే చర్చ జరుగుతుందట. గతంలో జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడంతో అప్పటి మంత్రి మారెప్పను మంత్రి పదవికి రాజీనామా చేయించారు ఆనాటి సీఎం వైఎస్ఆర్. ఇపుడు ఉపఎన్నిక వస్తే.. ఫలితాల్లో తేడా కొడితే మంత్రి జయరాం పదవికే ఎసరు రావొచ్చని చెవులు కొరుక్కుంటున్నారట. మరి..ఈ సమస్య ఎటు నుంచి ఎటు దారితీస్తుందో చూడాలి.

## జగన్ ఆచితూచి అడుగులు




తిరుపతి, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్) సాధారణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మైండ్సెట్ వేరు. అప్పటికప్పుడే ఆయన హామీ ఇస్తారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేస్తారు. పెద్దగా సమయం కూడా తీసుకోరు. ప్రధానంగా పార్టీ కోసం పనిచేసి మరణించిన వారి కుటుంబాల పట్ల జగన్ అస్సలు టైం తీసుకోరు. కానీ ఒక్క విషయంలో జగన్ ఆలోచనలో పడ్డారని అనిపిస్తుంది. ఇంతవరకూ ఆ కుటుంబానికి ఎటువంటి పదవి ఇవ్వకపోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. జగన్ మదిలో ఏముంది? జగన్ ఆ కుటుంబానికి వేరే విధంగా న్యాయం చేస్తారా? లేక పూర్తిగా పక్కన పెడతారా? అన్న టాక్ పార్టీలో వినపడుతుంది.తిరుపతి పార్లమెంటు సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్ మరణించారు. ఆయన కరోనా కారణంగా మరణించారు. బల్లి దుర్గాప్రసాద్ కుటుంబానికి జగన్ హామీ ఇచ్చారు. తిరుపతి ఎంపీ టిక్కెట్ ఆ కుటుంబానికి ఇవ్వకుండా డాక్టర్ గురుమూర్తికి ఇచ్చినా బల్లి దుర్గాప్రసాద్ తనయుడు కల్యాణ్ చక్రవర్తికి మాత్రం ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. కొంత ఆలస్యమయినా ఎమ్మెల్సీ పదవి ఖాళీ అయిన వెంటనే కల్యాణ చక్రవర్తిని ఎమ్మెల్సీని చేశారు. విజయవాడకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ కరీమున్నీసా 2021 డిసెంబరు నెలలో గుండెపోటుతో మరణించారు. అయితే వెంటనే ఆమె కుమారుడు రుహుల్లాకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చనిపోయిన తర్వాత అక్కడకు చేరుకుని భౌతిక కాయానికి నివాళులర్పించిన జగన్ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. చెప్పినట్లుగానే వారికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు.అలాగే 2020 డిసెంబరు నెలలో వైసీపీ ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి మరణించారు. వెంటనే జగన్ ఆ కుటుంబానికి హామీ ఇచ్చినట్లుగానే ఆయన కుమారుడు భగీరథ్రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంలో పెద్దగా ఆలస్యం చేయలేదు. కానీ దురదృష్టవశాత్తూ చల్లా భగీరథ్రెడ్డి కూడా మరణించారు. అయితే ఆయన కుటుంబానికి జగన్ ఎలాంటి హామీ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. చల్లా భగీరథ్రెడ్డి సతీమణి శ్రీలక్ష్మి రాజకీయాల్లోనే ఉన్నారు. ప్రస్తుతం అవుకు ఎంపీటీసీగా ఆమె కొనసాగుతున్నారు. బనగానపల్లెలో చల్లా కుటుంబానికి ప్రత్యేకత ఉంది. వర్గమూ ఉంది. కానీ జగన్ మాత్రం ఆ కుటుంబానికి ఎలాంటి హామీని ఇంతవరకూ ఇవ్వలేదంటున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో చల్లా శ్రీలక్ష్మికి బనగానపల్లె ఎమ్మెల్యే సీటు ఇవ్వాలన్న యోచనలో ఉన్నారని కొందరు అంటున్నారు. మామ, భర్తను కోల్పోయిన కుటుంబానికి ఆసరాగా నిలవాలని జగన్ ఎమ్మెల్సీ పదవి విషయంలో ఆ కుటుంబానికి హామీ ఇవ్వలేదంటున్నారు. అందుకే నవంబరు 2వ తేదీన చల్లా భగీరథ్రెడ్డి మరణించినా ఇప్పటి వరకూ ఎమ్మెల్సీ పదవి విషయంలో మాత్రం జగన్ పెదవి విప్పలేదంటున్నారు. బనగానపల్లి ప్రస్తుత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబంలో ఒకరికి ఇచ్చే ఛాన్స్ లేకపోలేదని చెబుతున్నారు. అలాగే మరో నేత బిజ్జం పార్థసారథి రెడ్డి పేరు కూడా బనగానపల్లె టిక్కెట్ రేసులో వినపడుతుంది. అందుకే చల్లా భగీరథ్రెడ్డి కుటుంబానికి ఇంతవరకూ ఎమ్మెల్సీ పదవిని ప్రకటించడం లేదన్న చర్చ పార్టీలో జరుగుతుంది.

## మంగళగిరిలో ఉద్రిక్తత

అమరావతి :మంగళగిరి టిడిపి జాతీయ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత నెలకొంది. ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం ముట్టడికి టిడిపి ఎస్సీ సెల్ నేతలు బయలుదేరారు. వారిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసారు. ఈనేపధ్యంలో ఇరువురికి తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు తీరును నిరసిస్తూ జాతీయ రహదారిపై నేతలుబైటయించారు. టీడీపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎమ్ ఎస్ రాజు మాట్లాడుతూ దళితులకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తుంటే అరెస్టులు చేస్తున్నారు. వందలాది మంది పోలీసులను కాపలా పెట్టి సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద పహారా కాస్తున్నారు. దళితుల అభివృద్ధి కోసం టిడిపి తెచ్చి 27 పథకాలను నిలిపివేశారు.మాల, మాదిగ, రెల్లి,కార్పొరేషన్లు నిధులను నిలిపివేశారు. అనంతబాబు ఒక దళితుడుని హత్య చెస్తే ప్రభుత్వం కాపాడుతుంది. దళితులకు రాష్ట్రంలో న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

## జగన్ రెడ్డి ప్రభుత్వానికి రైతు ఉసురు తగులుతుంది

మైలవరం :జగన్ రెడ్డి ప్రభుత్వానికి రైతు ఉసురు తగులుతుందని మాజీమంత్రి దేవినేని ఉమ అన్నారు. ధాన్యం రైతులను దళారులు అప్పజెప్పారు. బస్తాకు 300 నుంచి 500 నష్టపోతున్నారు.. నీ 3వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఎక్కడుంది ప్రకృతి వైపరిత్యాల నిధి ఏమైంది. మీకు గడ్డిపెట్టాలని 15రోజుల నుండి నేను కల్లాల వెంబడి తిరుగుతున్నా. గోదావరి తల్లి నీళ్లొచ్చే కాలువలను కూడా బతకనిచ్చే పరిస్థితి లేదు గ్రావెల్ దోచుకెళ్తున్నారు. తడిసి, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా, అధికారంలో ఉండగా మద్దతుధర ఇచ్చి కొనుగోలు చేయించా ఇది చరిత్ర. ఈ సంవత్సరం ఎంత పంట వచ్చింది.. మిల్లర్లు ఎంత కొన్నారు ఇంకా ఎంత ఉంది ప్రభుత్వం స్పష్టంగా బయట పెట్టాలి. జగన్ రెడ్డి నోటి మాటలు తప్ప క్షేత్ర స్థాయిలో ఏమీ జరగడం లేదు ఒక్క అధికారి వచ్చి సమాధానం చెప్పిన ధాఖల్లాల్లేవు. దళ్యా పంట గురించి ఆలోచించకుండా పొమ్మనకుండా పొగ పెడుతున్నాడు. ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు.

## పేర్ని నానిపై మండిపడ్డ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం... :అబద్దాన్ని అందంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రచారం చేశారు అందువల్లనే కాపులకు న్యాయం జరగలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు అభిప్రాయ పడ్డారు. రాజమహేంద్రవరంలో అయన మీడియాతో మాట్లాడారు. తరువాత బిజెపి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో మాట్లాడారు. వైసీపి ఎమ్మెల్యే పేర్నినాని వ్యాఖ్యల పై సోమువీర్రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపుల రిజర్వేషన్లు కేంద్రం తీర్మానం చేయాలని ఏవిధంగా చెబుతారని ప్రశ్నించారు. ముస్లింలకు మాత్రం కేంద్రం అవసరంలేదు కేవలం కాపులకు మాత్రం కేంద్రం కావాలా అంటూ పేర్నినాని వ్యాఖ్యల పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.బిసిల రాజకీయ రిజర్వేషన్లలో ముస్లింలకు టిక్కెట్లు ఇవ్వడం వల్ల బిసిలు ప్రజా ప్రతినిధులు అయ్యే అవకాశాన్ని కోల్పోతున్నారని సోమువీర్రాజు మీడియాతో అన్నారు. అదే విధంగా బిసిల సమస్యల పై ఏలూరు నిర్వహించినట్లుగానే జోనల్ వారీగా సభలు నిర్వహిస్తామన్నారుఅబద్దాల ను నిజం చేసేందుకు మన రాష్ట్రంలో కుటుంబ పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. ముస్లింలకు రాష్ట్రప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చి కాపులకు మాత్ర కేంద్రం అంటున్నారు ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాల్సిన అవసరం ఉంది. కాపులకు అన్నాయం చేసింది కుటుంబ పార్టీలని ఆయన ఆరోపించారు పాదయాత్రల్లో హామీలు ఇస్తారు అధికారంలోకి రాగానే హామీలు మరుస్తున్నారు ఇదే మన రాష్ట్రంలో జరుగుతోంది ఈవిషయాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి సమస్యలను పరిష్కరించకుండా జఠిలం చేస్తున్నాయని కుటుంబ పార్టీల పై సోమువీర్రాజు విరుచుకు పడ్డారు.ఎస్సీ సబప్లాన్ నిధులు దారిమళ్ళిస్తున్న ఈ ప్రభుత్వాన్ని తామే నిలదీశామన్నారు గుంటూరులో నిరసన దీక్షలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 44వేల పోలింగ్ బూత్ ల స్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్మాణం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## బీజేపీ నేతలు ఎంపీ అరవింద్ ఇంటి ముందు ధర్నా చేయాలి

### టిపిసిసి నాయకులు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల బీజేపీ నేతలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేయడం కాదని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని బాండ్ పేపర్ ద్వారా హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిన స్థానిక పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ ఇంటి ముందు ధర్నా చేయాలని జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు.. బుధవారం స్థానిక పత్రిక విలేకరులతో కృష్ణారావు మాట్లాడుతూ 2019 సంవత్సరంలో పార్లమెంట్ ఎన్నికల్లో ముత్యంపేట సుగర్ ఫ్యాక్టరీ తన సొంత నిధులతో తెరిపిస్తానని, అలాగే పసుపుకు ప్రత్యేక బోర్డు సాధిస్తానని పసుపుకు మద్దతు వచ్చేల చెస్తానని బాండ్ పేపర్ ద్వారా ప్రజలకు హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిన ధర్మపురి అరవింద్ ఇంటి ముందు ధర్నా చేయాలని బిజెపి నాయకులకు జువ్వాడి కృష్ణారావు సూచించారు ..రైతు రుణమాఫీ చేయాలంటూ బిజెపి నాయకులు దొంగ నాటకాలు ఆడుతున్నారని ఇలా దొంగ ధర్నాలు చేయడం కాదని గతంలో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేశవ్యాప్తంగా రైతులకు ఏకకాలంలో రుణాలు మొత్తాలను మాఫీ చేసిందని కానీ నేడు బిజెపి ప్రభుత్వం ఆదాని, అంబానీ ,నీరవ్ మోడీ విజయ్ మాల్యా, ఇతర బడా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడిదారులకు లక్షలాది కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేసిందని కానీ ప్రజలకు పేద రైతులకు మాత్రం ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా ఈరోజు దొంగ ధర్నాలకు దిగుతున్నారని జువ్వాడి కృష్ణరావు తీవ్రంగా మండిపడ్డారు.. టిఆర్ఎస్ పార్టీ నేడు బిజెపి పార్టీ తోడుదొంగలా కలిసి అధికారంలో ఉండి ధర్నాలు చేయడం ఏమిటని రుణమాఫీ చేసి బీద ప్రజల పట్ల రైతుల పట్ల తమ చిత్తశుద్ధి ఏపాటిదో నిరూపించుకోవాలని జువ్వాడి కృష్ణారావు అన్నారు.. బిజెపి, టిఆర్ఎస్ పార్టీల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని వీరి వ్యవహారం గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీలా ఉందని ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన సమయంలో కరు కాల్చి వాత పెడతారని జువ్వాడి కృష్ణారావు అన్నారు..

# ఏపీలో జోరు పెంచిన టీడీపీ

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీకి కాస్త ఉత్సాహం తెచ్చిన ఏడాది 2022. ఈ ఏడాది లో టీడీపీ పరిస్థితి మెరుగుపడింది అనే చెప్పాలి . 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత నిరాశ లో కూరుకు పోయిన టీడీపీ కి మూడేళ్ళ తర్వాత మళ్ళీ జోష్ నింపిన ఏడాదిగా 2022 ను చెప్పుకోవచ్చు . ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుండీ అధికార వైసిపీ పై ఆరోపణల దాడి చేస్తూనే వస్తున్నా చంద్రబాబు అండ్ టీమ్ కు 2022 లో ప్రజలనుండి స్పందన లభించింది . ఈ ఏడాది టీడీపీ చేపట్టిన ప్రభుత్వ విధానాల పై విమర్శలు గుప్పించే కార్యక్రమానికి 2022 లో ప్రజల నుండి కూడా అనూహ్య మద్దతు లభించింది . మూడేళ్ళుగా అధికార వైసీపీ నీ ,సీయం జగన్ విధానాలపై విమర్శలు గుప్పిస్తూ ఉన్నా ప్రజల నుండి పెద్దగా టీడీపీ కి స్పందన రాలేదు . ముఖ్యంగా 151 సీట్ల తో తిరుగులేని మెజారిటీ సాధించిన జగన్ ప్రభుత్వం పై ప్రజల్లో అసంతృప్తి అప్పటికి ఏర్పడలేదు . దానికి తోడు వైసిపీ ప్రభుత్వం ప్రకటిస్తూ వస్తున్న సంక్షేమ పథకాల హోరులో విపక్షాల ఆరోపణలు ప్రజలకు కనపడనే లేదు . అయితే ఎడాపెడా పెరిగిపోతున్న చార్జీలు , ధరలు ,చెత్త పన్ను విధింపు లాంటి చర్యలను టీడీపీ ఈ ఏడాది చేపట్టిన బాదుడే బాదుడు కార్యక్రమానికి ప్రజలనుండి బానే మద్దతు లభించింది . ఆ ఉత్సాహంతో టీడీపీ తాజాగా చేపట్టిన "ఇదేం ఖర్మరా బాబూ " కార్యక్రమానికి కూడా జనాలనుండి మంచి రెస్పాన్స్ వచ్చింది . ఈ కార్యక్రమంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి టీడీపీ గట్టి పోటీనే ఇచ్చింది . దీనితో పాటు పార్టీ పరంగా చేపట్టిన మినీ మహానాడు కార్యక్రమాలు పార్టీ కేడర్ లో మళ్ళీ జోష్ ను నింపాయని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి . మూడేళ్ళుగా తమపై ఎక్కడ కేసులు పెడతారో అన్న భయంతో ప్రభుత్వం పై విమర్శలు గుప్పించడానికి సీనియర్ నేతలు భయపడ్డారని టీడీపీ శ్రేణులే చెబుతాయి . కేవలం చంద్రబాబు ,లోకేష్ ,అయ్యన్నపాత్రుడు .అచ్చెన్నాయుడు , యనమల రామకృష్ణుడు . బుద్దా వెంకన్న , రామానాయుడు, కెయస్ జవహర్ , అనిత లాంటి కొందరు మాత్రమే క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా కనిపించేవారు . అయితే , ఈ ఏడాది మాత్రం సీనియర్ నేతలు జనాల్లోకి రావడం మొదలుపెట్టారని ,,, పార్టీ అధినేత వచ్చే ఎన్నికల్లో టికెట్స్ కావాలంటే రోడ్డు పైకి రావాల్సిందే అంటూ వార్నింగ్ లు ఇవ్వడం వల్లే వాళ్లలో కదలికలు వచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు . పార్టీకి కేడర్ సపోర్ట్ ఎప్పుడూ ఉంటూనే ఉన్నా .. లీడర్లు కూడా బయటకు రావడం ఒక శుభ పరిణామంగా టీడీపీ అభిమానులు భావిస్తున్నారు. 2018 లో టీడీపీ చేపట్టిన ధర్మ పోరాట దీక్షలు నుండి బీజేపీ తో పెరిగిన దూరం 2022 లో ఓ మేర తగ్గింది .ఇటీవల ఢిల్లీలో చంద్రబాబుతో ప్రధాని మోదీ పలకరింపుల తర్వాత బీజేపీ నేతలు టీడీపీ పై విమర్శలు తగ్గించారు . 2024 ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని బీజేపీ రెడీ చేసుకుంటున్న ప్లాన్-బీ పాలిటిక్స్ లో భాగంగా టీడీపీ తో మైత్రి సంకేతాలు అని ఎనలిస్టులు లెక్కలు గట్టినా .. టీడీపీ కి అయితే ఇది రాజకీయంగా కలిసి వచ్చే అంశమేనని అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల నుండీ జనసేన టీడీపీ మధ్య మళ్ళీ మైత్రి ఏర్పడుతుంది అని రాజకీయ పార్టీల్లో ఊహాగానాలు చెలరేగినా పవన్ విశాఖ ఎపిసోడ్ తర్వాత అది బలపడింది . ఏకంగా చంద్రబాబు వెళ్లి పవన్ పరామర్శించడం తో జనసేన తో టీడీపీ పొత్తు ఇక లాంఛనమే అన్న అభిప్రాయం అందరిలోనూ ఏర్పడింది . అయితే పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళతారా .. లేక విడివిడిగా పోటీ చేసి ఎన్నికల తర్వాత కలుస్తారా అన్నది 2023 లోనే తేలాల్సివుంది . 2014 తర్వాత రోజురోజుకీ తెలంగాణా లో బలహీన పడుతూ వచ్చిన టీడీపీ నెత్తిన పాలుపోసారు కేసీఆర్ అనే విశ్లేషణ రాజకీయాల్లో మొదలైంది . ఇంతవరకూ తెలంగాణ లో ఆంధ్ర పార్టీలు ఎందుకు అంటూ కౌంటర్ ఇచ్చిన కేసీఆర్ ఇప్పుడు తన జాతీయ పార్టీ బీఆర్ యస్ ద్వారా ఏపీలో కూడా పోటీకి రెడీ అవుతున్నారు . దీనిని సాకుగా చూపి చంద్రబాబు ఖమ్మం లో ఇటీవల జరిపిన పర్యటనలకు భారీ స్పందనే వచ్చింది .దానితో తెలంగాణ లో టీడీపీ కి క్రొత్త ఆశలు వచ్చాయని అంటున్నారు విశ్లేషకులు. ఇది 2022 లో టీడీపీ కి సంబంధించిన అతి పెద్ద పరిణామం అనుకోవచ్చు.నిన్న మొన్నటి వరకూ ప్రత్యర్థుల నుండి అనేక విమర్శలు ఎదుర్కొన్న నారా లోకేష్ ఈ ఏడాది పూర్తిగా గేరు మార్చారు . మంగళగిరి సహా రాష్ట్రం అంతా ఆయన చేసిన పర్యటనలు ..మాట్లాడే తీరు ..జనాలతో కలిసిపోవడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలకు జనాలనుండి మంచి రెస్పాన్స్ వచ్చింది . దీనిని బేస్ చేసుకుని 2023 జనవరి నుండి ఆయన చేపట్టబోతున్న రాష్ట్రవ్యాప్త పాదయాత్ర పై టీడీపీ భారీ అసలే పెట్టుకుంది . 2019 తో పోలిస్తే టీడీపీ పార్టీ పరంగా 2022 లో పుంజుకుందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఏకంగా 151 సీట్లతో ధీమాగా ఉన్న అధికార వైసీపీ ని ఓడించడానికి ఈ జోష్ సరిపోదు అనే వాదనలు ఉన్నాయి . చంద్రబాబు .లోకేష్ ఎంతగా కష్టపడుతున్నా పార్టీ లోకి యువతరాన్ని ఆకర్షించడం , క్షేత్ర స్థాయి కార్యకర్తలకు పెద్దపీట వేయడం , ప్రభుత్వ విధానాల లోని లోపాలను మరింత సమర్ధవంతంగా జనాల్లోకి తీసుకెళ్లడం లాంటి చర్యలు చేపడితేనే 2024 లో తాము అనుకున్న గమ్యాన్ని టీడీపీ చేరుకుంటుంది అని ఎనలిస్టులు అంచనా వేస్తున్నారు .మరి ఆ దిశగా అడుగులు 2023 లో ఏ మేర పడతాయన్నది చూడాలి

# 93 కోట్ల నుంచి 60 కోట్లకు తగ్గిన వైసీపీ ఆదాయం

విజయవాడ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)ఏపీలో అధికార పార్టీ ఆదాయానికి సంబంధించి ఆసక్తికర అంశాలు బయటికి వచ్చాయి. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీకి (వైఎస్ఆర్ సీపీ) గత ఏడాదితో పోల్చితే ఆదాయం తగ్గింది. దాదాపు 13 శాతానికి పైగా ఆదాయం తగ్గినట్లుగా తాజాగా ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. ఆ నివేదికను స్వయంగా పార్టీలే కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాయి. వైఎస్ఆర్ సీపీ సమర్పించిన నివేదిక ప్రకారం.. 2022 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వైఎస్ఆర్ సీపీకి రూ.93.72 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు అదే సమయంలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే సుమారు 13.21 శాతం తరుగుదల కనిపించినట్లయింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన 2022 ఆడిట్ రిపోర్టులో ఇంకా ఏమున్నాయంటే.. పార్టీకి 2021లో ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.96.25 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ సొమ్ము ఈ సారి రూ.60 కోట్లే వచ్చింది. ఇదే సమయంలో ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి వచ్చిన ఆదాయం అంతకుముందు ఏమీ లేదు. కానీ ఇది ఈ ఏడాది రూ.20 కోట్లకు చేరింది. అన్ని ఖర్చులుపోగా పార్టీకి నికరంగా రూ.92.72 కోట్ల ఆదాయం మిగిలిందని నివేదికలో పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంనాటికి ఉన్న రూ.250 కోట్ల ఓపెనింగ్ బ్యాలెన్స్‌తో కలిపితే 2022 మార్చి 31నాటికి పార్టీ జనరల్ ఫండ్‌కు రూ.343 కోట్లు చేరింది.

| | 31 మార్చి, 2022 | 31 మార్చి, 2021 |
|---|---|---|
| సంస్థల నుంచి డొనేషన్లు | 2,68,245 | 30,881 |
| ఎలక్టోరల్ ట్రస్టులు | 20,00,00,000 | - |
| ఎలక్టోరల్ బాండ్ల ద్వారా | 60,00,00,000 | 96,25,00,000 |
| ఇతర ఆదాయం | 13,69,73,811 | 11,73,75,137 |
| మొత్తం | 93,72,42,056 | 107,99,06,018 |
| ఖర్చులు | 1,00,21,634 | 80,79,994 |
| నికర ఆదాయం | 92,72,20,422 | 107,18,26,024 |
| ఓపెనింగ్ బ్యాలెన్స్ | 250,48,32,920 | 143,30,06,896 |
| జనరల్ ఫండ్‌లో మొత్తం | 343,20,53,342 | 250,48,32,920 |
| ఆస్తులు | | |
| నగదు | 183,71,50,360 | 250,34,45,540 |
| లోన్లు, అడ్వాన్సులు, డిపాజిట్లు | 159,48,08,150 | 18,08,100 |

# జీడీపీలో యూ ట్యూబ్...

ముంబై, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)ప్రముఖ ఆన్ లైన వీడియో ఫ్లాట్ ఫామ్ యూట్యూబ్ భారత జీడీపీ-2021కి ఎంతో తోడ్పాటును అందించింది. పరోక్షంగా, ప్రత్యక్షంగా కలిపి ఏకంగా రూ.10 వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చింది. ఏకంగా 7.5 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించింది. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన ఎకనామిక్స్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. భారత్ లో 4,500 పైగా యూట్యూబ్ ఛానెల్స్ కు 10 లక్షలకు పైగా సబ్ స్క్రైబర్స్ ఉన్నట్లు తెలిపింది. ఏడాదికి రూ.లక్షకు పైగా ఆదాయం సాధిస్తున్న ఛానెల్స్ సంఖ్య 2021లో ఏకంగా 60 శాతం పెరిగినట్లు వివరించింది.జనీబీబీఎవ ఆదాయం, ఉద్యోగ కల్పన, ప్రభావం మీద ఆక్స్ ఫర్డ్ ఎకనామిక్స్ ఓ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో భాగంగా 4 వేలకు పైగా యూట్యూబ్ వినియోగదారులు, 5 వేలకు పైగా యూట్యూబ్ క్రియేటర్లు, 5 వందలకు పైగా వ్యాపార సంస్థలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. ఈ సర్వేలో పలు కీలక విషయాలు వెల్లడి అయ్యాయి. ఉద్యోగాలు చేస్తున్న ప్రతి ఇద్దరు యూట్యూబ్ యూజర్లలో ఒకరు తమ కెరీర్ కు యూజ్ ఫుల్ గా ఉండే టెక్నిక్స్ తెలుసుకునేందుకు యూట్యూబ్ ఉపయోగిస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలను పొందాలి అనుకునే వారిలో 45 శాతం మంది వారికి అవసరమైన నైపుణ్యాన్ని యూట్యూబ్ ద్వారా పొందే ప్రయత్నం చేస్తున్నారు. యూట్యూబ్ ను విద్యారంగంలో గతంతో పోల్చితే ఎక్కువగా వినియోగిస్తున్నారు. సాధారణ విద్యాభ్యాసానికి అదనంగా యూట్యూబ్ ను విద్యావేత్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు వినియోగిస్తున్నారు. యూట్యూబ్ ద్వారా పిల్లలు చాలా ఈజీగా, సరదాగా నేర్చుకుంటున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వెల్లడించారు. విద్యార్థులు చక్కటి అవగాహన పెంచుకునేందుకు యూట్యూబ్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు, అధ్యాపకులు వెల్లడించారు" అని నివేదిక తెలిపింది. గతంతో పోల్చితే మహిళలు సైతం యూట్యూబ్ ను ఎక్కువగా వినియోగిస్తున్నట్లు ఆక్స్ ఫర్డ్ నివేదిక వెల్లడించింది. పర్సనల్ ఫైనాన్స్ సహా స్ఫూర్తినిచ్చే సలహాలు పొందేందుకు యూట్యూబ్ ను వినియోగిస్తున్నారు. తమ ఇష్టాఇష్టాలను ఆదాయ వనరుగా మార్చుకునేందుకు, కెరీయర్, వ్యాపారాలను నిర్మించుకునేందుకు వాడుకుంటున్నారు. తమ జీవితానికి తోడ్పడే ఎన్నో విషయాలను నేర్చుకునేందుకు మహిళలు యూట్యూబ్ ను సాధనంగా మార్చుకున్నారు. ఎన్నో విషయాలను నిత్యం తెలుసుకునేందుకు యూట్యూబ్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని 77 శాతం మహిళలు చెప్పారు. అటు రోజు వారీ నైపుణ్యాల కోసం సహాయకరంగా ఉందని 56 శాంత మహిళలు వివరించారు. తమ ఆసక్తినికి, ఆలోచనలను పంచుకునేందుకు ఉపయోగపడుతుందని 90 శాతం మహిళలు వివరించారు. ఆక్స్ ఫర్డ్ ఎకనామిక్స్ అధ్యయనం ప్రకారం.. భారత యూట్యూబ్ క్రియేటర్స్ ద్వారా రూపొందిన కంటెంట్ ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది ప్రజలు వినియోగిస్తున్నట్లు తేలింది. పలు భాషల్లో రూపొందుతున్న కంటెంట్ వినియోగదారులకు ఉపయోగపడటంతో పాటు క్రియేటర్స్ కు భారీగా ఆదాయం సమకూరుతున్నట్లు వెల్లడైంది. అటు కంటెంట్ క్రియేటర్స్ కు మరింత మేలు కలిగేలా మానిటైజేషన్ ప్రక్రియను తీసుకురానున్నట్లు యూట్యూబ్ తెలిపింది.

# మెరుగైన పోలీపింగ్ తో నేరాల తగ్గించగలిగాం

## డీజీపీ రాజేంద్రనాధ్ రెడ్డి

అమరావతి :రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాధ్ రెడ్డి బుధవారం వార్షిక సమీక్ష నిర్వహించారు. తరువాత మీడియాతో మాట్లాడారు. డీజీపీ మాట్లాడుతూ విజబుల్ పోలీసింగ్, అవగాహన కార్యక్రమాలను చేపట్టడం, మహిళా పోలీసు సేవల సమర్థవంత నిర్వహణ, పీడి యాక్ట్ ప్రయోగం, నాటు సారా పై ఉక్కుపాదం మోపడం తదితర చర్యల వల్ల నేరాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు.గతేడాది 2,84,753 కేసులు నమోదు కాగా, 2022లో 2,31,359 కేసులు మాత్రమే నమోదయ్యాయి. 2021 లో 945 హత్య కేసులు నమోదు కాగా, 2022లో 857 హత్య కేసులు మాత్రమే నమోదయ్యాయి. చోరీల్లో నేరస్తులను గుర్తించడం, మరియ రికవరీ శాతం బాగా పెరిగాయి. రోడ్డు ప్రమాదాలు 2021 లో 19203 జరుగగా 2022 లో 18739 ప్రమాదాలు జరిగాయని అన్నారు. బ్లాక్ స్పాట్ లను గుర్తించి నివారణా చర్యలు చేపట్టాం. లోక్ అదాలత్ తో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారిస్తున్నాం. చిన్నపాటి వివాదాలు, మనస్పర్థల కారణంగా వివాదాల్లో ఉన్న కేసులలో ఇరువర్గాలను పిలిపించి రాజీ కుదిర్చాం.

# పిడకలు తయారు చేయండి... గిఫ్ట్ పొందండి



శ్రీకాకుళం, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్) సంక్రాంతి పండగ అంటే ముందుగా గుర్తు వచ్చేది భోగి. అసలు పండగంటే నెల రోజుల ముందునుంచి హడావుడి మొదలవుతుంది. ధనుర్మాసం ప్రారంభించిన తరువాత భోగి రోజున వెలిగించే మంటల్లో పిడకలు వేయడం సాంప్రదాయం. వీధిలో వెలిగే భోగి మంటల్లో పిడకలు వేయనిదే భోగి చేసినట్టు ఉండదు. అలాంటిది రానురాను సాంప్రదాయాలు మారుతున్నాయి. అయినా తిరిగి పూర్వవైభానికి నాంది పలికేందుకు సిక్కోలు యువత, మహిళలు నడుం బిగిస్తున్నారు. భోగి అంటే స్వచ్ఛమైన ఆవుపేడతో తయారు చేసిన పిడకలను మంటల్లో వేస్తే ఆ ఆనందం ఆ ఆరోగ్యం వేరే అంటున్నారు. ఈ ఆధునిక రోజుల్లో, ఉరుకులు పరుగుల జీవితంతో కొన్ని సంప్రదాయాలు మూలన పడుతున్నాయి. అయినా సంక్రాంతి పండగంటే ప్రాధాన్యత తగ్గలేదు. అందులో భోగికి పట్టణాల్లో లేకపోయిన గ్రామాల్లో సందడి కనిపిస్తుంది. ఇటీవల అపార్టమెంట్లలో సామూహిక మంటలు చేసి డిజే సౌండ్లతో సందడి కనిపిస్తుంది. అయినా గ్రామీణ ప్రాంత వాతావరణం వేరేబ్బా అంటున్నారు. కొందరు మార్కెట్లో భోగి పిడకలు విక్రయాలు చేస్తుండడంతో డిమాండ్ పెరిగింది. కొంతమంది అవ్వలను తట్టితే భోగి మంట వెనుక ఎన్ని నులివెచ్చని జ్ఞాపకాలు దాగుంటాయంటారు.కర్రల వేట నుంచి భోగి రాత్రి జాగారం వరకు చేసిన పనులు, పోగు చేసిన అనుభూతులు గుండె గదిలో శాశ్వతంగా నిలిచిపోతాయంటారు పెద్దలు. కానీ నేటితరం అలాంటి జ్ఞాపకాలుమూటగట్టుకోవడంలో విఫలమవుతోందని ఆవేదన చెందుతున్నారు. కృత్రిమ రీతిలో పండగలు నిర్వహిస్తూ రెండు ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేయడానికి మాత్రమే పరిమితమవుతోందని ఆవేదన చెందుతున్నారు. కలిసికట్టుగా పండగ చేసుకోవడంలో ఉన్న ఆనందాన్ని ఆస్వాదించలేకపోతోందని, నేటి తరం సంప్రదాయ పండుగలకు దూరమవుతారనే ఆందోళన వెంటాడుతుందంటున్నారు. ఇలాంటి సాంప్రదాయాన్ని కొనసాగించడంతో పాటు పూర్వీకుల మాట తద్దీ మూట అంటారని అందుచేత వారు విడిచేపెట్టి వాటిని కొనసాగించాలని తపనతో శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం మురపాక వాసులు మళ్లీ ఆ నాటి సంప్రదాయానికి జీవం పోస్తున్నారుపాశ్చాత్య మోజులో పడి మన సంస్కృతి, సంప్రదాయాలు, పండగలు, ఆచారాలను చాలా మంది పాటించడం తగ్గిస్తున్నారు. మన ఆచారాలను సజీవంగా నిలపాలని మురపాక గ్రామంలో వినూత్నంగా భోగి పిడకల పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఎవరైతే ఎక్కువ భోగి పిడకలను తయారుచేస్తారో వారికి భోగి పండగ రోజు ప్రత్యేక బహుమతులు ఇస్తామని ప్రచారం చేస్తున్నారు. దీంతో గ్రామంలోని మహిళలు, పిల్లలు, వృద్ధులు, పెద్దలు, రైతులు, యువకులు చాలా మంది గ్రామస్తులు కా ర్యక్రమంలో పాల్గొని బహుమతుల కోసం భోగి పిడకలు తయారు చేసేందుకు పోటీ పడుతున్నారు. చిన్నారులు అయితే ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతిరోజూ గ్రామంలో ఆవుపేడను సేకరించి వాటితో పిడకలు తయారు చేస్తున్నారు. భోగి పండగ రోజు ఆవుపేడతో తయారు చేసిన పిడకలను కాల్చడం వలన పాజిటివ్ వైబ్రేషన్లు వస్తాయని, మనసుకు ప్రశాంతత కలుగుతుందని అంటున్నారు.మురపాకలో సందడి ముందే వచ్చేసిందని స్థానికంగా వినిపిస్తోంది. గత ఏడాది కరోనాతో విలవిలాడిన జనానికి ఈసారి సంక్రాంతితో ఆ కష్టాలను పారదోలాలని మురపాక గ్రామస్థులు భావించారు. అనుకున్నదే తడువుగా గ్రామంలో అందరు కలిసికట్టుగా సమావేశం ఏర్పాటు చేసుకొ కొని భోగి పిడకల వేటలో దిగడంతో ఆ గ్రామంలో అప్పుడే పండగ వాతావరణం ఏర్పడింది. ఆ గ్రామాన్ని ఆదర్శంగా చేసుకుని ఊరూర పిడకలు తయారు చేసి ఈ సారి సంక్రాంతి పండగకు కొత్త శోభను తీసుకురావాలని మురపాక వాసులు భావిస్తున్నారు.

# కాపు వర్సెస్ బలిజ

తిరుపతి, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయం కొన్ని రోజులుగా కాపుల చుట్టూ తిరుగుతోంది. కాపునాడు అందుకు కారణమైంది. అయితే.. కీలక నేతలు ఎవరూ కాపునాడులో కనిపించకపోవడంతో.. అది సక్సెస్ కాలేదనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో.. తాజాగా మరో అంశం ఏపీ రాజకీయాల్లో కీలకంగా మారింది. కాపులంటే కేవలం కోస్తా జిల్లాల వారేనా.. రాయలసీమలోని బలిజలు కాదా..? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. 30 ఏళ్ల కిందట ఎన్టీఆర్ 10 ఎమ్మెల్యే స్థానాలు ఇస్తే.. ఇప్పుడున్న పార్టీలు కనీసం ఒక్క స్థానం కూడా బలిజలకు ఇవ్వడం లేదని.. బలిజ నేత ఓవీ రమణ వ్యాఖ్యానించారు.'కాపులు 28 శాతం ఉన్నారు. ఎన్నికల ముందు జరిగే తంతు ఇప్పుడు మళ్లీ జరుగుతోంది. 14 శాతం ఉన్న బలిజలను ఎవ్వరూ గుర్తించడం లేదు. కాపు నేతల నాయకత్వంలో మేము పనిచేసినా.. మా గురించి ఎవ్వరూ మాట్లాడటం లేదు. కేవలం బొండా, కన్నా, గంటా కలిస్తే.. కాపులు అందరూ ఏకమైనట్టా. ఇప్పటివరకు బలిజలకు జరిగిన నష్టాన్ని ఎవ్వరూ ప్రస్తావించలేదు. అందుకే.. ఇప్పుడు బలిజలు వేరు అనే భావన వస్తోంది. ఎక్కడా బలిజ ప్రస్తావన రావడం లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎన్టీఆర్ బలిజలను గుర్తించారు. వైఎస్సార్ కాపులను గుర్తించారు. ఇన్నాళ్లు మమ్మల్ని గుర్తిస్తారని ఆగాం. కానీ.. అది జరగడం లేదు. రంగాపైనా మాకు అభిమానం ఉంది' అని టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఓవీ రమణ వ్యాఖ్యానించారు.'30 ఏళ్లు కిందట ఎన్టీఆర్ బలిజలకు 10 ఎమ్మెల్యే స్థానాలు ఇచ్చారు. రాజంపేట నియోజకవర్గం పుట్టినప్పటి నుంచి బలిజ స్థానమే. కానీ.. ఇప్పుడు ఎవరికి ఇస్తున్నారు. ఇన్నాళ్లు కాపుల సారథ్యంలో పనిచేశాం. మా ఆధ్వర్యంలో వారు పని చేయలేదు. ఒకానొక సమయంలో నాపై దాడి చేశారు. కాపులు త్యాగం చేసి మాకు ఇవ్వాలని మేము అండగటం లేదు. మాక్కూడా రాజకీయంగా హక్కులు ఇవ్వాలని కాపులు నేతలు అడగాలి. కాపు, బలిజ కలిస్తేనే బలం. అది వాళ్లు కూడా గుర్తించారు. బలిజల దగ్గర డబ్బులు లేదని జీవీఎల్ అనడం తప్పు. ఆయన చూశారా.. అది నిజమే అయితే.. నామినేటెడ్ పదవులు ఎందుకు ఇవ్వలేదు' అని రమణ ప్రశ్నించారు.ఇటు వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ రోజు రాజకీయ పార్టీలు రంగాను ఓన్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఏరోజు కనీసం పేరెత్తని పార్టీలు ఇవాళ రంగా పేరుతో రాజకీయం చేస్తున్నాయి. కాపులం అందరం కలిసి ఉంటేనే 28 శాతం అవుతుంది. రాయలసీమలో ఉన్న బలిజలను మేము ఎప్పుడూ తక్కువ చేయలేదు. వారు, మేము ఒకటే. రమణ మాట్లాడింది తప్పు అని నేను అనుకోవట్లేదు. అందరూ కలిసి ఉంటేనే గట్టిగా నిలబడే అవకాశం ఉంటుంది. ఎప్పుడు సమావేశాలు పెట్టుకున్న బలిజలను ఆహ్వానించాం. రాజకీయాలు వేరు.. సామాజికవర్గం వేరు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలోని కాపులు అందరూ ఒకటే. మనల్ని ఉద్ధరించడానికి ఏ పార్టీ ఉండదు. పార్టీలు కేవలం మమ్మల్ని ఉపయోగించుకుంటాయి. పార్టీలు కేవలం గెలుపు ఓటములు మాత్రమే చూస్తాయి. అలాంటప్పుడు బలిజలను కాపులు ఎలా మోసం చేస్తారు' అని తోట త్రిమూర్తులు వ్యాఖ్యానించారు.'కాపులను బీసీల్లో చేర్చాలని ఓవీ రమణ ఉద్యమం చేయాలి. ఎందుకు సీట్లు ఇవ్వడం లేదని రాజకీయ పార్టీలను నిలదీయాలి. రంగా అనే వ్యక్తి అన్ని వర్గాలకు అండగా నిలబడ్డారు. కాపునాడు స్టార్ట్ చేసింది కే.కేశవరావు. ఆయనకు అవగాహన ఉంది కాబట్టి.. కాపునాడు నిర్వహించారు. ఆ తర్వాత మిరియాల వెంకట్రావ్ కాపునాడును నిర్వహించారు. కానీ.. ఇప్పుడు కాపులను, బలిజలను విభజించి పాలించాలని చూస్తున్నారు. కాపులు రాయలసీమలో లేరు. అక్కడి బలిజలకు సీటు ఇవ్వాల్సింది పార్టీలు.

# చంపేస్తున్న చలి

న్యూఢిల్లీ, డిసెంబర్ 28, (న్యూస్ పల్స్)దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో.. చలి, పొగమంచు దట్టగా కురుస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రానున్న రోజుల్లోనూ చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 29 న హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పశ్చిమ యూపీలో దట్టమైన పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రానున్న 3 నుంటి 4 రోజుల పాటు ఈ రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగవచ్చు. దట్టమైన పొగమంచు కారణంగా వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాజస్థాన్‌లోని సికార్‌లో చలిగాలుల పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా నగరంలో ఉష్ణోగ్రతలు మైనస్‌లో నమోదవుతున్నాయి. ఈ ఏడాది చివరి రెండు రోజుల్లో చలికాలంలో కాస్త ఉపశమనం లభించినా.. కొత్త సంవత్సరం ప్రారంభం కాగానే మళ్లీ చలిగాలులు వీస్తాయి. ఇంతలో మంగళవారం దేశ రాజధానిలో చాలా చల్లని రోజు నమోదైంది. ఢిల్లీ కనిష్ట ఉష్ణోగ్రత డెహ్రాడూన్, ధర్మశాల, నైనిటాల్ కంటే దిగువకు చేరుకుంది. ఢిల్లీ ఎన్సీఆర్, హర్యానా, పంజాబ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తర రాజస్థాన్ సహా వాయువ్య భారతదేశంలోని విస్తృత ప్రాంతాలను దట్టమైన పొగమంచు ఆవరించింది. ఢిల్లీలో విజిబిలిటీ కేవలం 50 మీటర్లకు పడిపోయింది. దీంతో రోడ్డు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీకి వెళ్లే 15 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని, రెండింటిని రీ షెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఢిల్లీలోని ప్రాథమిక వాతావరణ కేంద్రమైన సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో కనిష్ట ఉష్ణోగ్రత 5.6 డిగ్రీల సెల్సియస్, సాధారణం కంటే ఒక డిగ్రీ తక్కువగా నమోదైంది. గరిష్ట ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉంది. డెహ్రాడూన్‌లో ఏడు డిగ్రీల సెల్సియస్, ధర్మశాలలో 6.2 డిగ్రీల సెల్సియస్, నైనిటాల్‌లో 7.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.మరోవైపు.. పంజాబ్‌లోని భటిండాలో 1.4 డిగ్రీల సెల్సియస్, అమృత్‌సర్‌లో ఐదు డిగ్రీలు, లూథియానాలో 6.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్తాన్‌లో తీవ్రమైన చలి కాలం కొనసాగుతోంది. కశ్మీర్ కూడా చలిగాలుల గ్రిప్‌లో చిక్కుకుంది. మొత్తం లోయలో ఉష్ణోగ్రత అనేక డిగ్రీల సెల్సియస్‌లు పడిపోయింది. పాదరసం సున్నా కంటే దిగువకు పడిపోయింది. ఆదివారం రాత్రితో పోలిస్తే సోమవారం రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రత ఒకటి నుంచి రెండు డిగ్రీలు తగ్గినట్లు అధికారులు తెలిపారు



## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాలి

కౌతాళం ,కౌతాళం మండలం బాదినేహాల్ గ్రామము నందు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంత్రాలయం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పాలకుర్తి తిక్క రెడ్డి సహకారంతో తెలుగుదేశం పార్టీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు క్లస్టర్ ఇంచార్జి వెంకటపతి రాజు ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేం కర్మ బాదినేహాల్ గ్రామంలో బుధవారం కురువ గేరి లో గ్రామ నాయకులు మాటూరు నరసింహులు ఉమేష్ గౌడ్ ప్రతి ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని మన రాష్ట్రానికి ఇదేమి కర్మ అని ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ గ్రామంలో ఉన్నటువంటి ప్రజలు కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అందరూ కూడా సుభిక్షంగా ఉంటాము అదేవిధంగా వైయస్సార్ ప్రభుత్వం వచ్చే నాలుగున్నర సంవత్సరాల అవుతున్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేసింది ఏమీ లేదు నిత్యవసర సరుకులు పెంచుకుంటూ అదేవిధంగా ఈరోజు కూడా నిజమైన నిరుపేద పింఛన్దారులను కూడా పింఛన్ తొలగింపు చేయడం చాలా సిగ్గుచేటు ఇలాంటి నీచ రాజకీయాలు మేము ఎప్పుడు చూడలేదు నిరుపేదలను ఆదుకునే దేవుడు మన రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ నారా చంద్రబాబునాయుడు రావాలి అదేవిధంగా మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరేస్తాం అని గ్రామంలో ఆ వీధి ప్రజలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు వలి భాష ,ఈరన్న, బసవ, సాధకలిభాష ,రమేష్, భీమేష్, మస్తాన్వలి , గోపాల్, రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.



## బద్వేల్ లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు



బద్వేలు , రామకృష్ణ సేవా సమితి బద్వేలు, చిన్మయ మిషన్ కడప పూజ్యశ్రీ తురీయానంద సరస్వతీ మహారాజ్ వారి ఆధ్వర్యంలో "స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల" సందర్భంగా శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ మరియు పీ.జి కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు జరిగినవి×."శ్రీ రాచపూడి నాగభూషణం ఫంక్షన్ హాల్" నందు జరిగిన ఈ వ్యక్తిత్వ వికాస తరగతులలో పూజ్యశ్రీ తురీయానంద స్వామి సరస్వతీ మహారాజు వారు విద్యార్థులకు వ్యక్తిత్వం మరియు విద్య ఆవశ్యకత పై చక్కని ఉపమానాలతో కూడిన సందేశం ఇచ్చారు. సమాజంలో మంచి – చెడు అనే రెండు వర్గాలు ఉంటాయి. చెడు సమాజాన్ని కలుషితం చేస్తుందని, చెడును అంత సులభంగా వేరు చేయలేమని మంచి విషయాలు పెంపొందించుకున్నప్పుడే దానిని క్రమంగా నిర్మూలించగలమన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులకు సులభరీతిలో ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద కలలు కన్న భావి భారత సమాజానికి మార్గదర్శకులు కావాలన్నారు.నేటి విద్యార్థులు రేపటి సమాజ నిర్మాతలని, కాలానుగుణంగా విద్యార్జనలో సృజనాత్మకతను



పెంపొందించుకోవాలని,మంచి విద్యతోనే సమాజంలో రాణించగలరని చక్కని సందేశం ఇచ్చారు. రామకృష్ణ సేవా సమితి కార్యనిర్వాహకులు అమరేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులలో నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించే ఆశయంతో ఏర్పడినదే రామకృష్ణ సేవా సమితి అన్నారు. యువతలో మానవత్వం, ధర్మం వంటి ఉత్తమ మార్గాలను పెంపొందించేందుకు ఎల్లవేళలా సమితి సేవా కార్యక్రమాల ద్వారా కృషి చేస్తుంటామన్నారు. ఈ సందర్భంగా పూజ్యశ్రీ తురీయా నందస్వామి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.కళాశాల పరిపాలనాధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు చక్కటి నైతిక విలువలు పెంపొందించే సదుద్దేశమే ఈ ప్రయత్నం అన్నారు. మహారాజు వారు చెప్పిన సందేశాలను ఆచరించి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాల అధిరోహించి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలన్నారు. మహారాజు వారికి మరియు రామకృష్ణ సేవా సమితి బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం కళాశాల బోధనా సిబ్బందికి మహారాజ్ వారి ఆధ్వర్యంలో "బోధనా మెలకువలు/వృత్తి నైపుణ్యాలు" పై ప్రత్యేక తరగతులు నిర్వహించబడినవి.ఈ కార్యక్రమంలో పూజ్యశ్రీ తురీయానంద సరస్వతీ మహారాజ్, కళాశాల పరిపాలనాధికారి ఉ మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ,అధ్యాపక బృందం, రామకృష్ణ సేవా సమితి కార్యనిర్వాహకులు అమరేంద్ర నాథ్ రెడ్డి, సభ్యులు శుక్లాజీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న గ్రామ సర్పంచ్

తుగ్గలి:: స్థానికంగా జరిగిన ఎన్నికలలో ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే మాట తప్పిన వారము అవుతామని ఆ సర్పంచ్ భావించాడు.నిధులు కొరత వున్నప్పటికీ ఆ పంచాయతీ కు వెలుగులు నింపాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు.నూతన సంవత్సరము నాటికి తన పంచాయతీ అయిన బొందిమడుగుల,మజరా లింగనేనిదొడ్డి గ్రామాలలో వెలుగులు నింపడానికి బుధవారం సర్పంచ్ చౌడప్ప శ్రీకారం చుట్టారు.15వ ఆర్థిక సంఘం ఇచ్చిన అరకొర నిధులుతో రెండు గ్రామాలకు సంబంధించి సుమారు 160 ఎల్ఇడి బల్బులను కరెంట్ స్తంభాలకు బిగించి వెలుగులు నింపారు.గ్రామాలలో గల వీధులలో బల్బులు వెలగడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చౌడప్ప మాట్లాడుతూ గ్రామాలలో గల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.గ్రామాలలో నీటి సమస్య మరియు విద్యుత్ బల్బుల సమస్యను పూర్తిగా పరిష్కరించామని,స్థానిక ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చామని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, వార్డు సభ్యులు మరియు పంచాయతీ గౌరవ అధ్యక్షులు ప్రతాప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..

**ప్రజా సమస్యల పరిష్కరించడంలో వైకాపా ప్రభుత్వ ఘోర వైఫల్యం. యువనేత రితేష్ రెడ్డి**





బద్వేలు, మూడున్నర సంవత్సరాల వైకాపా ప్రభుత్వంలో ప్రజలు అనేక రకాల సమస్యలతో సతమవుతమవుతున్నారని, వాటిని పరిష్కరించడంలో వైకాపా ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువనేత రితేష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశారుబుధవారం సాయంత్రం పిపి కుంట , చిన్న పి పి కుంట పరిధి లో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం జరిగిందిప్రజల నుంచి వివిధ సమస్యల మీద పెద్ద ఎత్తున వినతిపత్రాలు స్వీకరించడం జరిగింది ఈ సందర్భంగా పత్రిక విలేకరుల ఉద్దేశించి రితేష్ రెడ్డి మాట్లాడుతూ.... ఎన్నికలలో వైకాపా నాయకులు ఇచ్చిన ఉక దంపుడు హామీలకు ప్రజలు నమ్మి ఒక్క అవకాశం ఇచ్చారని,కానీ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు ప్రజా సమస్యల పరిష్కరించాలంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలని,తిరిగి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తధ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గోపవరం మండలానికి చెందిన తెదేపా చెందిన కార్యకర్తలు,నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## 2022 టాలీవుడ్ కి ఊపు తెప్పించిన సినిమాలు ఇవే..!




ప్రతి ఏడాది కొత్త సినిమాలతో బాక్సాఫీస్ కి కొత్త ఉత్సాహం తెప్పిస్తాయి కొత్త సినిమాలు. ఇక పెరిగిన మార్కెట్ దృష్ట్యా నేషనల్ వైడ్ గా కూడా దుమ్ముదులిపేందుకు వచ్చాయి. 2022 లో భారీ అంచనాలతో వచ్చిన సినిమా ఉన్నాయి. ఆ అంచనాలను మించి ఆడిన సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది సూపర్ హిట్ కొట్టి బాక్సాఫీస్ కి ఊపు తెప్పించిన సినిమాల లెక్క ఎలా ఉందో ఒకసారి చూస్తే.. ముందుగా దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఆర్.ఆర్.ఆర్. ఎన్.టి.ఆర్ రాం చరణ్ ఇద్దరు కలిసి నటించిన మెగా మల్టీస్టారర్ మూవీ ఇది. ఎవరిని తక్కువ చూపించినా మరొకరి ఫ్యాన్స్ చేసే గొడవని తట్టుకోలేం అయినా సరే రాజమౌళి ఆర్.ఆర్.ఆర్ లో ఇద్దరిని బ్యాలెన్స్ చేసిన తీరు అద్భుతం అమోఘం.ఈ ఏడాది సూపర్ హిట్ సినిమాల లిస్ట్ లో ఫస్ట్ అండ్ ఫోర్ మోస్ట్ గా నిలిచింది ఆర్.ఆర్.ఆర్. ఈ సినిమా ఇండియాలోనే కాదు ఇంటర్నేషనల్ లెవల్ లో కూడా హంగామా కొనసాగించింది. అవార్డులు రివార్డుల గురించి అయితే లెక్కే లేదు. సంక్రాంతికి వచ్చిన బంగార్రాజు కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబట్టాడు. నాగార్జున నాగ చైతన్య కలిసి నటించిన ఈ మల్టీస్టారర్ మూవీ కూడా బాక్సాఫీస్ కి ఊపు తెచ్చేలా చేసింది. ఇక ఈ లిస్ట్ లో బాక్సాఫీస్ కి ఊపు తెప్పించిన మరో సినిమా ఈ3. ఈ2కి సీక్వల్ గా అదే పాత్రలని కొనసాగిస్తూ చేసిన ఈ సినిమా అనీల్ రావిపుడి మార్క్ ఎంటర్టైనింగ్ మూవీగా ప్రేక్షకులను మెప్పించింది.ఇక ఈ ఏడాది ప్రేక్షకులను ప్రేమానురాగాల్లో ముంచెత్తేలా చేసిన సినిమా సీతారామం. హను రాఘవపుడి డైరెక్షన్ లో వైజయంతి మూవీస్ స్వప్న సినిమాస్ నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది. మళయాళ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా తెలుగుతో పాటుగా సౌత్ అన్ని భాషల్లో ఒకేసారి రిలీజైంది. హిందీలో కూడా తర్వాత రిలీజై సక్సెస్ అందుకుంది.ఇక 2022 బ్లాక్ బస్టర్ సినిమాల్లో ఒకటి నిఖిల్ కార్తికేయ 2. కార్తికేయ 1 ని కొనసాగిస్తూ కార్తికేయ 2 చేయగా ఊహించని విధంగా ఆ సినిమా నేషనల్ వైడ్ సూపర్ ట్రెండ్ అయ్యింది. నిఖిల్ అండ్ టీం కూడా ఈ సినిమా చేసిన అద్భుతాలను ఊహించలేదని చెప్పొచ్చు. 100 కోట్ల మార్క్ తో ఈ ఏడాది అసలు సిసలైన హిట్ బొమ్మగా నిలిచింది కార్తికేయ 2. ఇక ఏడాది చివర్లో నిఖిల్ 18 పేజెస్ సినిమా కూడా ప్రేక్షకులను మెప్పించింది. సుకుమార్ కథతో వచ్చిన ఈ సినిమాను సూర్య ప్రతాప్ డైరెక్ట్ చేశారు.2022 లో రెండు హిట్ సినిమాలను అందించారు యంగ్ హీరో అడివి శేష్. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవిత కథతో తీసిన మేజర్ సినిమాతో ఒక హిట్ అందించగా రీసెంట్ గా హిట్ 2 తో మరో సక్సెస్ అందించారు. బాక్సాఫీస్ కళకళలాడటంలో తన వంతు కృషి చేశాడు అడివి శేష్.ఈ ఏడాది మొదట్లో డీజే టిల్లు హంగామా తెలిసిందే. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి సిద్ధు జొన్నలగడ్డ చేసిన హంగామా అదిరిపోయింది. టిల్లు హంగామాకి బాక్సాఫీస్ కూడా కళకళలాడింది. శర్వానంద్ ఒకే ఒక జీవితం కూడా మంచి కలెక్షన్స్ రాబట్టి హిట్ గా నిలిచింది. కళ్యాణ్ రాం బింబిసార కూడా కమర్షియల్ గా సూపర్ హిట్ అందుకుంది. టైం ట్రావెల్ కాన్సెప్ట్ తో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేసింది. కళ్యాణ్ రాం ఖాతాలో మంచి హిట్ సినిమాగా నిలిచింది బింబిసార.ఈ ఏడాది వచ్చిన బెస్ట్ హారర్ థ్రిల్లర్ మూవీ మసూద. కొత్త వారితో చేసిన ఈ ప్రయత్నం మౌత్ టాక్ తో సూపర్ హిట్ గా నిలిచింది. సినిమా చూసిన ఆడియన్స్ అంతా సూపర్ రెస్పాండ్ అవుతూ సినిమా హిట్ లో భాగమయ్యారు.ఇక ఈ ఏడాది చివరి హిట్ గా ధమాకా మూవీ అని చెప్పొచ్చు. రవితేజ మార్క్ మాస్ మసాలా సినిమాగా ధమాకా వచ్చింది. స్టోరీలో పెద్దగా విషయం లేకపోయినా మాస్ రాజా ఫ్యాన్స్ కి ఈ సినిమా కనెక్ట్ అవడంతో సినిమా బాక్సాఫీస్ దగ్గర సందడి చేస్తుంది. ఫుల్ రన్ లో ఈ సినిమా మంచి లాభాలు తెచ్చేలా ఉందని చెప్పొచ్చు.

## వాల్తేరు వీరయ్య... ట్రైలర్ వస్తే కానీ క్లారిటీ వచ్చేది లేదు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందిన వాల్తేరు వీరయ్య సినిమా కోసం మెగా ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శృతి హాసన్ హీరోయిన్ గా నటించగా రవితేజ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. బాబీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఫ్యాన్స్ కు ఇప్పటికే పిచ్చెక్కిస్తోంది.ఈ



సినిమా చిత్రీకరణ మొదలు అయ్యింది మొదలు చిరంజీవిని ఎలా చూడాలి అనుకుంటున్నారో అలా తాను చూపించబోతున్నట్లుగా దర్శకుడు బాబీ చెప్పుకొచ్చాడు.చిరంజీవి అభిమాని అయిన బాబీ ఈ సినిమాలో తన అభిమాన నటుడిని తాను చూడాలి అనుకున్నట్లుగా చూపించబోతున్నట్లుగా తెలుస్తోంది.ఇక ఈ సినిమా యొక్క కథ ఏంటీ.. నేపథ్యం ఏంటి అనేది మాత్రం చాలా సస్పెన్స్ గా ఉంచుతూ వచ్చారు. హీరోయిజంను ఫుల్ గా ఎలివేట్ చేస్తూ అభిమానులను తెగ రంజింపజేసే విధంగా స్క్రీన్ ప్లే ఉంటుందని దర్శకుడు బాబీ సన్నిహితుల వద్ద చెప్పుకొచ్చాడట.ఈ సినిమా ట్రైలర్ విడుదల అయితే కథ ఏంటీ.. అసలు నేపథ్యం ఏంటి అనేది క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. వాల్తేరు వీరయ్య సినిమా యొక్క ట్రైలర్ విడుదల తేదీ విషయంలో ఇప్పటికే క్లారిటీ వచ్చింది. జనవరి 4వ తారీకు ఈ సినిమా యొక్క ట్రైలర్ ను విడుదల చేస్తారని తెలుస్తోంది.వాల్తేరు వీరయ్య సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమాలోని పాటలు మరియు పోస్టర్స్ చూస్తూ ఉంటే మాస్ ఎలిమెంట్స్ ఫుల్ గా ఉంటాయని తెలుస్తోంది. కానీ ఇప్పటి వరకు ట్రైలర్ రాకపోవడంతో కథ మరియు స్క్రీన్ ప్లే విషయంలో క్లారిటీ లేదు.

## మొన్న గెలిపించారు.. ఇవాళ ర్యాంకింగ్స్‌లో దుమ్ములేపారు




బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమిండియాను గెలిపించిన రవిచంద్రన్ అశ్విన్, శ్రేయాన్ అయ్యర్‌లు ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ అదరగొట్టారు.వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో(డబ్ల్యూటీసీ) భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఐసీసీ ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది.బంగ్లాతో రెండో టెస్టులో అశ్విన్ ఆరు వికెట్లు సహా బ్యాటింగ్‌లో 42 పరుగులు(నాలుగో ఇన్నింగ్స్) చేశాడు. 145 పరుగులను ఛేధించే క్రమంలో 70 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన దశలో శ్రేయాస్ అయ్యర్‌తో కలిసి అశ్విన్ 71 పరుగుల విలువైన భాగస్వామ్యం నిర్మించి టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు. బౌలింగ్ విభాగంలో అశ్విన్ 812 పాయింట్లతో మరో టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నాడు.ఇక అక్షర్ పటేల్ ఒక స్థానం దిగజారి 19వ స్థానంలో నిలిచాడు. ఇక ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో అశ్విన్ తన రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 343 పాయింట్లతో అశ్విన్ రెండో స్థానంలో ఉండగా.. తొలి స్థానాన్ని జడేజా కాపాడుకున్నాడు. 369 పాయింట్లతో ఎవరికి అందనంత ఎత్తులో ఉన్నాడు.ఇక బ్యాటింగ్ విభాగంలో టీమిండియా ఆటగాడు శ్రేయాస్ అయ్యర్ దుమ్మురేపాడు. బంగ్లాతో టెస్టు సిరీస్‌లో మంచి బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచిన అయ్యర్ ముఖ్యంగా రెండో టెస్టులో అద్భుతంగా ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో 87 పరుగులు చేసిన అయ్యర్.. రెండో ఇన్నింగ్స్‌లో అశ్విన్‌కు మద్దతిస్తూ 29 పరుగులు నాటౌట్ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అయ్యర్ ఏకంగా 10 స్థానాలు ఎగబాకి 666 పాయింట్లతో 16వ స్థానంలో నిలిచాడు.ఇక వికెట్ కీపర్ రిషబ్ పంత్ స్థానంలో ఎలాంటి మార్పు లేదు. బంగ్లాతో రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 93 పరుగులు చేసిన పంత్ తన ఆరో స్థానాన్ని నిలబెట్టుకోగా.. రోహిత్ శర్మ తొమ్మిదో స్థానంలో.. బంగ్లా సిరీస్‌లో విఫలమైన కోహ్లి రెండు స్థానాలు దిగజారి 14వ స్థానంలో ఉండగా.. బంగ్లాతో సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన పుజారా కూడా మూడు స్థానాలు దిగజారి 19వ స్థానంలో నిలిచాడు.

## సెంచరీ బాదినా కనబడదా? నువ్వు ఐర్లాండ్ వెళ్లి ఆడుకో?! ఇక్కడుంటే..

"పాపం.. అతడికి మరోసారి మొండిచేయి ఎదురైంది. శ్రీలంకతో సిరీస్‌లోనూ చోటు దక్కలేదు. జట్టులో స్థానం పొందేందుకు అతడు అన్ని విధాలా అర్హుడు.కానీ సెలక్టర్లు ఇలా వ్యవహరించడం ఏమీ బాగా లేదు. దయచేసి అతడి కెరీర్ నాశనం చేయకండి. మీ వైఖరి చూస్తుంటే ఈ యువ క్రికెటర్‌పై పగ బట్టినట్లుగా కనిపిస్తోంది. అసలు ఏ ప్రాతిపదికన జట్టును ఎంపిక చేస్తున్నారు. సెంచరీ బాదినా మీకు కనబడలేదా? అతడు ఇంకేం చేస్తే జట్టులోకి రాగలడు.తను చేసిన నేరమేంటి? బీసీసీఐ రాజకీయాలకు బలైపోతున్న ఆటగాళ్ల జాబితాలో తనకు మొదటి ర్యాంకు ఇవ్వాలి" అంటూ టీమిండియా అభిమానులు సెలక్టర్ల తీరును విమర్శిస్తున్నారు.శ్రీలంకతో సిరీస్ నేపథ్యంలోయువ బ్యాటర్ పృథ్వీ షాకు మరోసారి నిరాశే ఎదురైన విషయం తెలిసిందే.గతేడాది చివరిసారిగా..వన్డే, టీ20.. ఏ జట్టులోనూ అతడికి చోటు దక్కలేదు. దేశవాళీ? టోర్నీల్లో రాణిస్తున్నప్పటికీ ఈ ఓపెనింగ్ బ్యాటర్‌కు గత కొంతకాలంగా సెలక్టర్లు మొండిచేయి చూపుతూనే ఉన్నారు. గతేడాది జూలైలో శ్రీలంక పర్యటన తర్వాత పృథ్వీకి అవకాశాలు కరువయ్యాయి.

## అందాల భామలు.. స్టిల్ బ్యాచిలర్..!

తెర మీద అందంగా కనిపించే కథానాయిక జీవితాల్లో ఎన్నో ట్విస్టులు ఉంటాయి. తెర మీద కనిపించేంత వరకే వారు బాగుంటారు ఒక్కసారి వారి జీవితాల్లోకి తొంగిచూస్తే వారి అసలు విషయం అర్ధమవుతుంది. రంగుల ప్రపంచంలో ఏదో సాధిద్దామని వచ్చిన భామలు కొందరు గమ్యస్థానానికి ముందే కెరీర్ టర్న్ తీసుకుంటే కొందరు కెరీర్ పీక్స్ లో ఉండగా వెనక్కి తగ్గుతారు. అయితే కొన్నాళ్లు సినిమాల్లో అలరించి ఎంచక్కా పెళ్లి చేసుకుని లైఫ్ సెటిల్ చేసుకున్న వారు ఉంటారు. కానీ కొంతమంది హీరోయిన్స్ మాత్రం ఇప్పటికీ బ్యాచిలర్ గానే ఉంటున్నారు.సినిమాల్లో నటించి ఇప్పటికీ పెళ్లి చేసుకోకుండా ఉన్న వారి గురించి ఇప్పుడు చూస్తే.. ముందుగా ఈ వరుసలో సీనియర్ యాక్ట్రెస్ కాంచన వస్తారు. తెలుగు తమిళ భాషల్లో అందాల తార గా పేరు తెచ్చుకున్న కాంచన కెరీర్ ఫాం తగ్గాక పెళ్లి చేసుకోకుండా అలానే ఉన్నారు. ఆమెను పెంచిన పేరెంట్స్ ఆస్తి విషయంలో ఆమెను మోసం చేయడంతో జీవితం మీద విరక్తి వచ్చిన ఆమె పెళ్లి చేసుకోకుండా అలా సింగిల్ గానే ఉన్నారు. విజయ్ దేవరకొండ నటించిన అర్జున్ రెడ్డి సినిమాలో నాయనమ్మ పాత్రలో కాంచన నటించిన విషయం తెలిసిందే.ఇక సీనియర్ యాక్ట్రెస్ లలో పెళ్లి చేసుకుండా ఉన్న వారిలో ఆషా పరేఖ్ కూడా ఒకరు. ఆమె వయసు 80 ఏళ్లు. 1952లోనే సినీ కెరీర్ స్టార్ట్ చేసిన ఆమె ఎన్నో సినిమాల్లో నటించారు. దాదాసాహెబ్ ఫ్వాల్కే అవార్డు సైతం అందుకున్నారు ఆశా ఫరేఖ్.మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఒకప్పటి తార శోభన కూడా 50 ఏళ్లు దాటినా కూడా పెళ్లి చేసుకోలేదు. అప్పట్లో ఆమె పెళ్లాడుతారని వార్తలు రాగా తను సింగిల్ గానే సంతోషంగా ఉన్నానని ఆమె వెల్లడించారు. ఒక స్టార్ హీరోతో శోభన ప్రేమ ఫెయిల్ అవడమే ఆమె అలా బ్యాచిలర్ గా ఉండిపోవడానికి కారణమని అందరు చెప్పుకుంటారు. ఇక ఇదే లిస్ట్ లో ఒకప్పటి హాట్ హీరోయిన్ నగ్మా కూడా ఉంది. సౌత్ లో టాప్ లేపిన ఈ అందాల భామ అప్పటి స్టార్స్ అందరితో కలిసి ఆడి పాడింది. ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్న నగ్మా పెళ్లి మాత్రం చేసుకోలేదు. గంగూలీతో ప్రేమాయణం నడిపించిన అమ్మడు ఆ తర్వాత పెళ్లి ఊసు ఎత్తలేదు. అంతేకాదు హీరోలతో ఆమె డేటింగ్ వార్తలు అప్పట్లో హెడ్ లైన్స్ లో ఉండేది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**